విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :144 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 11 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## నవంబర్ 15 నాటికి

# ఎన్నికలు పూర్తి



- అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదే
- స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ ఫిక్స్ చేశారు
- గెలుపు టార్గెట్ 100 శాతంగా నిర్ణయించారు
- నవంబర్15 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, పాలనపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.
- కేబినెట్ భేటీ ముగిశాక సహచర మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు

**అమరావతి**

స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ ఫిక్స్ చేశారు. గెలుపు టార్గెట్ 100 శాతంగా నిర్ణయించారు. నవంబర్ 15 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, పాలనపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కూటమి పార్టీల సమన్వయం వరకు ఎన్నికల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొంటూనే నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల విడుదలపైనా కీలక ప్రకటన చేశారు. కేబినెట్ భేటీ ముగిశాక సహచర మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు. స్థానిక సంస్థల ఎన్నికలే అజెండాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సన్నద్ధత,

వివరాలు 2లో..



## మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

- చేసిన నేరాలకు మూల్యం చెల్లించాల్సిందే'
- చెన్నైలో జరిగిన ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది




## గెలిస్తే నిజాయతీ ఓడితే అవకతవకలా

- ఈసీకి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్‌ల బహిరంగ లేఖ
- భారత ఎన్నికల సంఘానికి, సర్ ప్రక్రియకు మద్దతుగా 124 మంది సభ్యుల మాజీ ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల
- ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదు



## పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ

# కవచంలా నిలవాలి

- స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయి
- పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలి
- రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదు
- 2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు జరిగాయని, అలాంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచింది
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

## నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

- ఢిల్లీలో ఉద్రిక్తతకు దారితీసిన సీజేపీ నిరసన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీజేపీ చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి
- నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## అక్టోబర్ 2028 నాటికి

# రాజధాని పూర్తి చేయడమే లక్ష్యం



- ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం
- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ




## విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి

# కేసు నమోదు చేసిన ఎన్ఐఏ

- విమానం గాల్లో ఉండగానే కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది.
- ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది.

## ప్రకృతి సేద్యంలో దేశంలోనే

# ఏపీ అగ్రస్థానం

- ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ 1, 25 లక్షల మంది రైతులు లక్ష్యం: సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడమే లక్ష్యం
- రసాయనాలతో పోలిస్తే ప్రకృతి సాగుతో 47 శాతం పెరిగిన రైతుల ఆదాయం
- రసాయన ఎరువుల వాడకం తగ్గించినందుకు కేంద్రం నుంచి రూ.218 కోట్ల ప్రోత్సాహకాలు
- జీవామృతం తయారీ కోసం రాష్ట్రంలో మరిన్ని గోకులాలు నిర్మిస్తామని వెల్లడి



**అమరావతి**

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎండీఎస్)పై ఆయన శనివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2016లో కేవలం 40 వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ ప్రస్థానం నేడు 17.73 లక్షల మందికి చేరిందన్నారు. కొందరు గతంలో ఇది విజయవంతం కాదని దుష్ప్రచారం చేసినా, రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించారని కొనియాడారు. రసాయన ఎరువులతో భూసారం క్షీణించి, సాగు ఖర్చులు పెరిగి రైతులకు భారం అవుతోందన్నారు. కానీ ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. "రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సగటున 47 శాతం మేర ఆదాయం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల్లో 87 శాతం నికర ఆదాయం లభించింది. తీవ్రమైన కరవు పరిస్థితులను సైతం తట్టుకుని ఈ విధానంలో మంచి దిగుబడులు వస్తున్నాయి," అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి

వివరాలు 2లో..

## పాకిస్థాన్‌లో మరో దారుణం..

- క్రైస్తవుడి ఇల్లు, షాప్‌కు నిప్పు.. 35 కుటుంబాల వలస
- పాకిస్థాన్‌లో క్రైస్తవుడిపై దైవదూషణ ఆరోపణలు
- ఆగ్రహంతో ఇల్లు, దుకాణాన్ని తగలబెట్టిన ముస్లిం మూక
- భయంతో 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు గ్రామం విడిచి పరారీ
- భారీగా పోలీసుల మోహరింపు, దర్యాప్తు ప్రారంభం
- దైవదూషణ చట్టాల దుర్వినియోగంపై తీవ్ర ఆందోళన



# నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి

-మొదటిపేజీ తరువాయి

బీసీ రిజర్వేషన్లు, రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని సూచించారు. ఈ ఎన్నికల ద్వారా కొత్త నాయకత్వం తెరపైకి వస్తుందని స్పష్టం చేశారు. కూటమిలోని మూడు పార్టీల మధ్య సమన్వయమే ఎన్నికల్లో కీలకమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మంత్రులు పరస్పరం సంప్రదింపులు జరుపుతూ ముందుకు వెళ్లాలని సూచించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని తేల్చిచెప్పారు. ఏ ఒక్క స్థానాన్ని కోల్పోవడానికి వీల్లేదని, అన్ని స్థానాల్లోనూ విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు.



### పార్టీ పరంగా సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్లు

బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికలోని వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా వైఎస్సార్సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని చంద్రబాబు విమర్శించారు. గతంలో బీసీలకు అమలైన 34 శాతం రిజర్వేషన్లను జగన్ ప్రభుత్వం తగ్గించిందని, హైకోర్టు కొట్టివేసిన జీవోలపై సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తుంటే వైఎస్సార్సీపీ కోర్టును ఆశ్రయించిందని ఆక్షేపించారు. వైఎస్సార్సీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా ఉంటే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవని వ్యాఖ్యానించారు.

బీసీలకు పార్టీల పరంగా సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలని చంద్రబాబు సూచించారు. ఎస్ఐఆర్ తర్వాత వెలువడే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని జగన్ కోర్టును ఆశ్రయించడంపై సీఎం విమర్శలు చేశారు. ఓటమి భయంతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా పరిషత్‌ల సంఖ్య పెరిగినందున జడ్పీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కొత్త రోస్టర్ రూపొందించాల్సిన అవసరం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం

ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం ఉన్నప్పటికీ గత ఏడాది నీటిని నిల్వ చేసుకోవడం వల్ల ఈ ఏడాది కొంతవరకు ఇబ్బందుల నుంచి బయటపడగలిగామని వివరించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. పాలనలో మంత్రులు మరింత చురుగ్గా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రేక్షకుల్లా ఉండిపోకుండా కొత్త విషయాలు నేర్చుకుంటూ పాలనా వ్యవహారాలపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖల మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని సాధించాలని ఆదేశించారు. కేంద్రంతో సమన్వయం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించుకోవాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ఒక్కో నియోజకవర్గానికి కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సోమ, మంగళవారాల్లో ఈ నిధులను విడుదల చేస్తామని తెలిపారు. దీంతో స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులోకి రానున్నాయి.

# పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా నిలవాలి



**తాడేపల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా, అవసరమైనప్పుడు న్యాయపరమైన ఆయుధంలా నిలవాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ లీగల్ సెల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పూడి శ్రీహరి, లీగల్ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయని, పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదని ఆయన అన్నారు. 2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు జరిగాయని, అలాంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచిందని అభినందించారు.

### ఎస్ఐఆర్ పూర్తయ్యేలోపే ఎన్నికలకు ఎందుకు తొందర?

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో చనిపోయినవారి, డూప్లికేట్, అనర్హ ఓట్లు తొలగిస్తున్న పరిస్థితుల్లో, కొత్త ఓటర్ల జాబితా అందుబాటులోకి రాకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం తొందరపడుతోందని సజ్జల అన్నారు. ఎస్ఐఆర్ ఫైనల్ జాబితా త్వరలోనే రావాల్సి ఉన్నప్పుడు, దానికి ముందే నోటిఫికేషన్ ఇవ్వాలనే ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారిని జాబితాలో చేర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే వారి రాజ్యాంగబద్ధ హక్కు దెబ్బతింటుందని అన్నారు.

### బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికను ప్రజలకు అందుబాటులో పెట్టకుండా శాతం నిర్ణయించడం ఏ ప్రాతిపదికన జరిగిందో వెల్లడించాలని సజ్జల డిమాండ్ చేశారు. కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆధారాలు వెల్లడించాలని అన్నారు.

### నామినేషన్ దశ నుంచే అప్రమత్తంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు పోరాటం నామినేషన్ దశ నుంచే ప్రారంభమవుతుందని సజ్జల అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌ఓసీలు, ఇతర అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా అభ్యర్థులకు ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉందని, అందువల్ల ముందుగానే అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేయించాలని సూచించారు. రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత నామినేషన్లకు చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉన్నందున, అభ్యర్థులు, ప్రత్యామ్నాయ అభ్యర్థులు, అవసరమైన లీగల్ టీమ్‌లను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని చెప్పారు.

### గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్ నెట్‌వర్క్

ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండే న్యాయవాదులను మ్యాపింగ్ చేసి, వారి కాంటాక్ట్ వివరాలను కంప్యూటరైజ్ చేయాలని సజ్జల సూచించారు. గ్రామ స్థాయి అభ్యర్థికి కూడా తనకు అవసరమైనప్పుడు ఏ న్యాయవాదిని సంప్రదించాలో ముందుగానే తెలిసేలా వ్యవస్థ ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో లీగల్ వార్‌రూమ్, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు, రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి సమాచారం చేరి, అవసరమైతే స్టేట్ ఎలక్షన్ కమిషన్, కోర్టులను ఆశ్రయించేలా వ్యవస్థ పనిచేయాలని చెప్పారు. సెన్సిటివ్ ప్రాంతాలు, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ముందుగానే గుర్తించి, అక్కడి పరిస్థితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

### స్థానిక యుద్ధానికి సిద్ధం కండి... కార్యకర్త జోలికి ఎవరైనా వస్తే...

### ప్రతి అక్రమాన్ని రికార్డు చేయాలి

ఎన్నికల సమయంలో అధికారులు, పోలీసులు లేదా ఇతరులు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వాటిని ఆధారాలతో నమోదు చేయాలని సజ్జల చెప్పారు. ప్రతి ఫిర్యాదు, ప్రతి ఘటన, ప్రతి అధికారిపై వచ్చిన ఆరోపణను డిజిటల్‌గా రికార్డు చేసి, అవసరమైతే లీగల్ చర్యలకు ఉపయోగించాలన్నారు. ఫీల్డ్ స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని మీడియా, సోషల్ మీడియా, లీగల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

### పార్టీ కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా నిలిచింది: పొన్నవోలు

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండున్నరేళ్లుగా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న కేసులు, అరెస్టులు, వేధింపుల సమయంలో లీగల్ సెల్ వారికి భరోసాగా నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆయన, పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టిన సందర్భాల్లో లీగల్ సెల్ వీధుల్లోనూ, కోర్టుల్లోనూ పోరాడిందన్నారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేస్తున్న ప్రతి న్యాయవాదిని భవిష్యత్తులో పార్టీ గుర్తిస్తుందని, వారికి తగిన గౌరవం లభించేలా చూడాలని కోరారు.

### అభ్యర్థులకు న్యాయవాదులు వెన్నుముకగా నిలవాలి: చెవిరెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి లీగల్ సెల్ కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కొత్తగా పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, నామినేషన్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చని, అందువల్ల న్యాయవాదులు వారికి ప్రతి దశలో మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

నామినేషన్ పత్రాలు నింపడం నుంచి దాఖలు చేయడం వరకు, కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర అవసరమైన పత్రాలు పొందడం వరకు లీగల్ సెల్ పూర్తి బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఏ అభ్యర్థి నామినేషన్ కూడా సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురికాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నామినేషన్‌కు సమర్పించిన పత్రాలన్నింటినీ స్కాన్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు డిజిటల్ రూపంలో కూడా పంపితే, తర్వాత పత్రాలు లేవని చెప్పి తిరస్కరించే పరిస్థితుల్లో ఆధారంగా ఉపయోగపడుతుందని సూచించారు. నామినేషన్ తిరస్కరణ జరిగితే వెంటనే న్యాయపరంగా స్పందించి అవసరమైతే కోర్టును ఆశ్రయించాలని చెప్పారు.

ప్రతి నియోజకవర్గంలో న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ అభ్యర్థులకు కేసులు, అరెస్టులతో భయపెట్టే ప్రయత్నాలు జరిగినా వారికి ధైర్యం చెప్పి, చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత లీగల్ సెల్‌పై ఉందన్నారు. తాను కూడా అనేక కేసులు, జైలు జీవితం ఎదుర్కొన్న అనుభవాన్ని ప్రస్తావిస్తూ, కష్టాలను భయపడకుండా గట్టిగా నిలబడటం ద్వారానే రాజకీయంగా ఎదగగలమని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే నాయకులే భవిష్యత్తులో మరింత ఉన్నత బాధ్యతలకు ఎదగగలరని అన్నారు. అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా దాఖలు కావడం నుంచి వారి గెలుపు వరకు న్యాయవాదులు వెన్నుముకగా నిలవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో లీగల్ సెల్ ప్రధాన పాత్ర పోషించాలి అని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం: మనోహర్‌రెడ్డి

లీగల్ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సమావేశం సాధారణ పార్టీ సమావేశం కాదని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను పరిరక్షించే బాధ్యతతో ఏర్పాటు చేసిన సమావేశం అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పోలీస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలు, రౌడీ షీట్లు, బైండ్ ఓవర్ కేసులు తదితర అంశాల్లో న్యాయవాదులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

నియోజకవర్గ కమిటీలను వెంటనే పూర్తి చేసి, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అవసరమైన న్యాయసహాయం 24 గంటలు అందుబాటులో ఉండేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. లీగల్ సెల్‌లో నిజాయితీగా, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారిని ప్రోత్సహించాలని, అవకాశవాదులను దూరంగా ఉంచాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు ప్రతి దశలో పార్టీ అభ్యర్థులకు పూర్తి న్యాయపరమైన రక్షణ కల్పించేందుకు లీగల్ సెల్ రాష్ట్రవ్యాప్తంగా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## ప్రకృతి సేద్యంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం

-మొదటిపేజీ తరువాయి

సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీ ముందంజలో ఉందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రశంసించారని గుర్తుచేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 2.28 శాతం తగ్గిందని, దీనికి గాను కేంద్రం నుంచి రావాల్సిన రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశామని చంద్రబాబు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు అనంతపురం జిల్లాలో 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు తవ్వించామని, నదుల అనుసంధానంతో వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని అన్నారు. కషాయం, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల కోసం మరిన్ని గోకులాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులే తనకు అసలైన స్ఫూర్తి అని, వారి కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యం

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

## పట్టిసీమ ఫలం.. సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

**పట్టిసీమ ద్వారా నీరందించిన సీఎం చంద్రబాబును కలిసిన కృష్ణా డెల్టా రైతులు**

**చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్' అంటూ శాలువాతో సత్కరించిన రైతులు**

**పట్టిసీమతో 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించామన్న సీఎం**

**పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు ఇచ్చామని వెల్లడి**

**ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ**



పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జిఎస్టి వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది.2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జిఎస్టి వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జిఎస్టి వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జిఎస్టి వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది.

# దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయి ఎంపీ.

- అనకాపల్లి జిల్లాలో తొలి విడతగా 52 మూడు చక్రాల ట్రై స్కూటీల పంపిణీ.
- ఎమ్మెల్యేలతో కలిసి దివ్యాంగులకు ట్రై స్కూటీలను పంపిణీ చేసిన అనకాపల్లి ఎంపీ.
- గతంలో అనకాపల్లిలో దివ్యాంగులు నా దృష్టికి తెచ్చిన సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించా.
- దివ్యాంగులు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలి.
- భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ ట్రైసైకిళ్లు అందించే అవకాశాల పైనా దృష్టి.
- దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.
- ఆర్థిక స్వావలంబన సాధించాలి: ఎంపీ సీఎం రమేష్.
- జిల్లాలో భవిత సెంటర్లకు ఎంపీ నిధులు కేటాయించిన సీఎం కి ధన్యవాదాలు తెలిపిన కలెక్టర్.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 10:** దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తూ, వారు ఆత్మగౌరవంతో, స్వావలంబనతో జీవించేలా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తాయని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మూడు చక్రాల ట్రై స్కూటీల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న ఎంపీ సీఎం రమేష్, తొలి విడతగా జిల్లాలో 52 మూడు చక్రాల వాహనాలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ గతంలో అనకాపల్లిలో దివ్యాంగులు స్వయంగా తనను కలిసి తమ సమస్యలను వివరించారని, వారి సమస్యలను పార్లమెంట్‌లో కూడా ప్రస్తావించి సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. దివ్యాంగుల ఇబ్బందులను పరిష్కరించి, వారికి అవసర మైన సహాయ పరికరాలు, ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటు లోకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. కేవలం మూడు చక్రాల వాహనాల పంపిణీకే పరిమితం కాకుండా, దివ్యాంగుల వ్యక్తిగత అవసరాలను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరికరాలు, ప్రత్యేక యంత్రాలు, కళ్లద్దాలు తదితర సహాయక పరికరాలను అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. ప్రతి ఒక్కరికీ వారి అవసరాలకు తగిన పరికరాలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దివ్యాంగులు తమ శారీరక పరిమితులను చూసి నిరాశ చెందకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సీఎం రమేష్ పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతూ ఉన్నత స్థాయికి చేరుకున్న దివ్యాంగుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారికి అండగా నిలిచి, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సమాజం కూడా దివ్యాంగుల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారు గౌరవప్రద మైన జీవితం గడిపేందుకు సహకరించాలని కోరారు. దివ్యాంగులు ఇతరుల పై ఆధారపడకుండా ఆర్థికంగా ఎదిగేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణ సదుపాయాలను వినియోగించు కోవాలని సూచించారు. చిన్న దుకాణాలు, స్వయం ఉపాధి యూనిట్లు, ఇతర వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసర మైన అవకాశాల పై అవగాహన పెంపొందించు కోవాలని తెలిపారు. భవిష్యత్తులో పెట్రోల్ వాహనాలతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ ట్రైసైకిళ్లను అందించే అవకాశాలను కూడా పరిశీలించి, దివ్యాంగుల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు మరింత విస్తృతంగా అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరు భవిత సెంటర్లకు ఎంపీ నిధులు: అనకాపల్లి జిల్లాలో ఆరు భవిత సెంటర్ల ఏర్పాటుకు ఎంపీ నిధులు పూర్తిగా కేటాయించినందుకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎంపీ సీఎం రమేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, శిక్షణ, సంరక్షణ అందించడంలో భవిత సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని, వాటి ద్వారా పిల్లల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# త్రీడీ హౌసెస్ ద్వారా బుర్రిపాలెం రికార్డు క్రియేట్ చేసింది.

- రాబోయే 30 ఏళ్లలో మరిన్ని రికార్డులు నమోదు అవుతాయి.
- దేశ వ్యాప్తంగా పేరుగాంచిన ఇద్దరు నాయకులను ఆహ్వానించిన ఘనత మన గ్రామానికే దక్కుతుంది.
- బుర్రిపాలెం గ్రామస్తులతో కేంద్రమంత్రి పెమ్మసాని.





**గుంటూరు, పెన్ సత్తా, అక్టోబర్ 10**: 3డి ప్రింటెడ్ కాంక్రీట్ హౌసెస్ ఉ పీఎంఏవై – గ్రామీణ్ ద్వారా 3 లక్షల ఇళ్ల మంజూరుకు సంబంధించి అక్టోబరు 4 వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లు ముఖ్య అతిథులుగా బుర్రిపాలెంలో జరిగిన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామస్థులను పెమ్మసాని వ్యక్తిగతంగా శనివారం వెళ్లి కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. బుర్రిపాలెం లోని స్థానిక కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ 3డి హౌసెస్ గురించి ఎప్పటి నుంచో పనిచేస్తున్నాం. కార్యాచరణ పూర్తయ్యే వరకు ఎవరికీ చెప్పలేదు. అలాగే 3 లక్షల ఇల్లు ఇవ్వడం పై కూడా ఒక భారీ కార్యక్రమం ఏర్పాటు చేద్దామని చౌహాన్ అడిగారన్నారు. ఇది గ్రామీణ ప్రజలకు సంబంధించిన విషయం కాబట్టి ఎంత మంది వచ్చారు అనేకంటే ఎంత మంది ప్రేమగా వచ్చారు అనే విషయం ముఖ్యం కాబట్టి మా సొంత గ్రామంలో ఏర్పాటు చేశాం అన్నారు. ఇందుకు అది తక్కువ సమయం ఉన్నప్పటికీ అందరూ చాలా బాగా కష్టపడ్డారు, సహకరించారు అని అబినందించారులు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా చేస్తున్నటువంటి శివరాజ్ సింగ్ చౌహన్, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇద్దరూ కలిసి మన గ్రామానికి రావడం, మీ అందరూ ఎంతో ఘనంగా వారిని ఆహ్వానించడం నిజంగా చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడు 3డి హౌస్ అనేది రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఒక చర్చగా మారిందన్నారు. సోషల్ మీడియా మొత్తం కూడా దీని గురించే మాట్లాడుకుంటున్నారు. అన్ని సక్రమంగా సజావుగా సాగితే ప్రధానమంత్రి ని కూడా మన గ్రామానికి తీసుకు వచ్చే అవకాశం ఉందన్నారు. 3డీ హౌసెస్ 100 మొట్ట మొదటిగా నిర్మించబోతున్న గ్రామంగా మన బుర్రిపాలెం చరిత్ర లోకి ఎక్కిందన్నారు. రాబోయే 30 సంవత్సరాలో ఇలాంటి ఎన్నో రికార్డులు నమోదు అవుతాయని గర్వంగా చెప్పగలుగుతున్నాను అని పెమ్మసాని స్థానికులకు తెలియజేసారు. ఈ కాయక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఆధునీకరించి మంచినీటి చెరువు ను ప్రారంభించిన పెమ్మసాని.







**గుంటూరు, పెన్ సత్తా, అక్టోబర్ 10**:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పీఎంకేఎస్వై 2.0 తరఫున రూ. 49.91 లక్షల నిధులతో ప్రత్తిపాడు గ్రామం లోని మంచినీటి చెరువు పునరుద్ధరణ, ఆధునికీకరణ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బి రామాంజ నేయులు, టిడిపి నాయకులు వంగవీటి రాధాకృష్ణ తో కలిసి గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ నేను గ్రామీణ అభివృద్ధి కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రామాలను పట్టణాలకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు. వాటర్ షెడ్ అనే కేంద్ర పథకం ద్వారా గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టాము. గ్రామాల్లో సాయంత్రం వేళ ఎక్కడైనా వాకింగ్ చేయడానికి వీలుగా అనువైన ప్రదేశంగా దేశం లోనే ప్రప్రథమంగా వెంగళాయపాలెం లోని ఒక చెరువుని అభివృద్ధి పరిచి ఈ పథకాన్ని అమలుపరిచాము. మొట్ట మొదటి ప్రయత్నంగా చేసిన ఈ పైలెట్ ప్రాజెక్టు సక్సెస్ అయిందన్నారు. ఆ పథకం అమలులో భాగంగా ఆంధ్రప్రదేశ్లో 100 చెరువులు, మన గుంటూరు జిల్లాలో 10 చెరువులను తీసుకున్నాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అందించిన రూ.10 లక్షలను ఉపయోగించుకుని ఈ చెరువును అధికారులు చాలా చక్కగా అభివృద్ధి పరిచారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ గ్రామాలను వీలైనంత ఎక్కువగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వంగవీటి రాధా మాట్లాడుతూ సమర్థ లైన నాయకులు అధికారంలో ఉంటే అభివృద్ధి ఎలా చేయవచ్చు అని పెమ్మసాని తెలియజేస్తున్నారన్నారు. అభివృద్ధికి మోడల్ గా రాష్ట్రంలో గుంటూరు పార్లమెంటును ఒక మోడల్గా తీర్చిదిద్దుతున్నారన్నారు. అందుకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరందరూ కూటమికి మద్దతు ఇవ్వాలి అని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. స్థానిక శాసనసభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని 25 ఏళ్లు వెనక్కి నెట్టేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాహితం కోరుతూ, ప్రజలకు ఏమి కావాలో వాటిని అభివృద్ధి చేస్తూ ముందుకు వెళుతుంది అన్నారు.

ప్రజా సౌకర్యాల కోసం ఏ శాఖను, ఏ అధికారులను వెంటపడి పనిచేపిస్తే అభివృద్ధి జరుగుతుందో తెలిసిన నాయకులు మన పెమ్మసాని చంద్రశేఖర్ అని తెలిపారు. గతంలో ఇండియాలో ప్రాజెక్టుగా వెంగళాయపాలెం చెరువును కేంద్ర ప్రభుత్వాన్ని నిధులతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని తీసుకొచ్చి ప్రారంభింపజేశారు. అదే తరహాలో మన జిల్లాలో పలు చెరువులను ఎంపిక చేయించి అభివృద్ధి పరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వుమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొరపాటి నాగేశ్వర రావు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ ప్రారంబించిన చింతమనేని



**దెందులూరు, పెన్ సత్తా, అక్టోబర్ 10:** పెదవేగి మండలం, డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో 70 వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ (2026-2027) ఘనంగా ప్రారంభ మైంది

ఈ కార్యక్రమాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం, మానసిక వికాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెరుగుతాయని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అంతే కాకుండా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించు కోవచ్చు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీట వేస్తోందని అన్నారు. ఇటీవల విడుదల చేసిన డిఎస్సీ నియామకాల్లో కూడా స్పోర్ట్స్ కోటా కింద అనేక మంది క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, రాబోయే రోజుల్లో పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా క్రీడాకారులకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ పోటీలు 10 తారీకు నుండి 12 వరకు మూడు రోజుల పాటు జరుగుతాయి. ఎలూరు జిల్లా ఎస్జిఎఫ్ అండర్/19 ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో రేపు ఆదివారం ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అనకాపల్లి ఆయుర్వేద వైద్యశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు.

## ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా డాక్టర్ కు ఘన సన్మానం.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 10**: అనకాపల్లి జిల్లా లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న డాక్టర్ ను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఆయుర్వేద వైద్య రంగంలో అందిస్తున్న విశేష సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి అవార్డు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లావణ్య జిల్లా ఆయుష్ అధికారి ని, ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాల, అనకాపల్లి సి. గణేష్ ని ఎంపీ శాలువాతో సత్కరించి, అవార్డు అందుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆయుర్వేద వైద్యుల కృషి అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం.

- రూ.15.56 లక్షల విలువైన చెక్కులు అందజేసిన ఎంపీ సీఎం రమేష్.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 10:** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎంపీ సీఎం రమేష్ బాధిత కుటుంబాలకు స్వయంగా అందజేశారు. జిల్లా లోని పలు నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.15,56,783 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్య చికిత్సలు, ఇతర అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న బాధితులకు మంజూరైన ఆర్థిక సాయాన్ని ఈ సందర్భంగా అందించారు. తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి పార్లమెంట్ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి ప్రత్యేక మరమ్మతులకు రూ.20 కోట్లు మంజూరు.



**కొత్తపేట, పెన్ సత్తా, అక్టోబర్ 10:** ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో రావులపాలెం బ్రిడ్జి నుంచి వెదిరేశ్వరం మీదుగా పలివెల బ్రిడ్జి వరకు జాతీయ రహదారి ప్రత్యేక మరమ్మతులకు రూ.20 కోట్లు మంజూరు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో రావులపాలెం బ్రిడ్జి నుంచి వెదిరేశ్వరం మీదుగా పలివెల బ్రిడ్జి వరకు జాతీయ రహదారి 9 కి.మీ ల పొడవునా పాడై దెబ్బతిన్న మట్టి రోడ్డుగా మారిపోయిన మెటల్ రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక మరమ్మత్తుల కింద రూ.20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. జాతీయ రహదారి 216 ఈ లో 22.730 కి.మీ నుంచి 27.600 కి.మీ వరకూ రూ.10 కోట్లు, 27.600 కి.మీ నుంచి 31.710 కి.మీ వరకూ రూ.10 కోట్లు మొత్తం రూ.20 కోట్లు మంజూరు అయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలిచి మూడు నెలల్లో ఈ పనులు చేపట్టనున్నట్లు,ఈ రహదారి అభివృద్ధితో వాహనదారుల సమస్యలు పరిష్కారం కానున్నాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వచ్చే సంవత్సరం ఈ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

## నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కమిటీ నియామకం.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 10:** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కమిటీ నియామకం జరిగింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్, మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బీమరశెట్టి రామ్కి సూచన మేరకు ముగ్గురికి అవకాశం కల్పించారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ కమిటీలో సభ్యులుగా పిల నాగ శ్రీను (గొల్ల బాబు), చేబ్రోలు దుర్గ ప్రసాద్, తాడి శాంతి కుమారులను సమరయకర్తలగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వారి నియామకం పట్ల పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

# పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి గంటా.







**భీమిలి, పెన్ సత్తా, అక్టోబర్ 10:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ భీమిలి మండలంలో ఇనాం గ్రామం నారాయణరాజు పేట మినహా పూర్తయినట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో దాకమర్రి, తాటితూరు, మజ్జివలసకు చెందిన 4,553 మంది రైతులకు శనివారం పాస్ పుస్తకాలు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాక ఇనాం గ్రామాల రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్య తొందర్లోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రెవిన్యూ అంశాల పైనే అత్యధిక అర్జీలు వస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ను రెవిన్యూ సమస్యల్లేని రాష్ట్రంగా చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారన్నారు. పాస్ పుస్తకాలు, సర్వే రాళ్ల పైనే కాకుండా ఆఖరికి మధ్యాహ్న భోజనంలో పిల్లలకిచ్చే కోడి గుడ్లు మీద ఫోటోలు ముద్రించుకున్న జగన్ మోహన్ రెడ్డి కి ప్రచారం పిచ్చి పీక్స్ కు చేరిందని విమర్శించారు. అలాంటి ప్రచార పైత్యం లేకుండా రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని రెండు రకాల పుస్తకాలను ప్రదర్శించారు. కోర్టుల్లో కేసు గెలవకున్నా బీసీలకు పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకుంటామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధిస్తేనే సమన్వయంతో అభివృద్ధికి బ్రేకు పడకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రామారావు, ఎంపీడీఓ నగేష్, డిప్యూటీ ఎంపీడీఓ రమేష్ నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, సరగడ అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు, డి.ఎ.ఎన్. రాజు, వై. అనిల్ ప్రసాద్, పాసి నరసింగరావు, గరికిన ఎల్లాజీ, కోరాడ రమణ, గరే సదానంద, గుడ్డాల ఎల్లయ్య, కురుమిన లీలావతి, బోయి శ్రీను, నక్కా శ్రీధర్, పాసి త్రినాథ్, చెట్టుపల్లి గోపీ, మీసాల సత్యనారాయణ, గరే గురునాథ్, నాగోతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం సందర్శన: భీమిలి మండల పరిషత్ ప్రాంగణంలో సీతమ్మధార కిమ్స్ ఆస్పత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గంటా శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. సిబ్బంది, రోగులతో మాట్లాడి అక్కడ చేస్తున్న వైద్య పరీక్షలు.. డాక్టర్ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఆర్థోపెడిక్, పల్మనాలజీ, కార్డియాలజీ, యురాలజీ, డెంటల్, ఐవీఎఫ్ కన్సల్టేషన్ సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి ప్రతినిధులు చెప్పారు. ఇదే ప్రాంగణంలో రోటరీ క్లబ్ కు చెందిన విజన్ సెంటర్ సంస్థ నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ లో రూ. 20 వేల కోట్ల భారీ కేటాయింపుల ద్వారా వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసి కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ఈకార్యక్రంలో కూటమి నాయకులు , అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ముందస్తు సన్నద్ధతతో ఉండాలి.

- ఎన్నికల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 10:** మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసర మైన ముందస్తు ఏర్పాట్లు, అధికారుల సన్నద్ధత పై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులతో శనివారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు సమన్వయంతో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి, అవి అన్ని విధాలా సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని సూచించారు. ఎక్కడైనా మరమ్మతులు అవసర మైతే వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు రిజర్వేషన్ నిబంధనల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి అంశం పై స్పష్టతతో వ్యవహరించాలని తెలిపారు. రిజర్వేషన్ల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అధికారులు వ్యక్తిగతంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాలను ఖరారు చేసే సమయంలో రహదారుల పై గుంతలు ఉన్నా, రహదారులు ఇరుకుగా ఉండి రాకపోకలకు ఇబ్బందులు ఎదురైనా ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే మరమ్మతులు చేయించి రహదారులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్నికల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై .సత్యనారాయణ రావు, ఆర్డీవోలు, జిల్లా పరిషత్ సీఈవో, డిప్యూటీ సీఈవో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ ను తక్షణమే తొలగించాలి.

దిల్లీలో అక్రమ అరెస్టులును, లాఠీచార్జిని ఖండించండి.

సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి డిమాండ్.




**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 10:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారుతున్నాయని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ఆయనను సీఈసీ పదవి నుంచి తక్షణమే తొలగించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం పరవాడ సంత బయలు దగ్గర నిరసన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గనిశెట్టి మాట్లాడుతూ సర్ పేరుతో కోట్లాది మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించడం పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం దిల్లీ లో నిరసనకారుల పై అక్రమ అరెస్టులు లాఠీ చార్జీని తీవ్రంగా ఖండించారు. 2026 సెప్టెంబర్‌లో వెలువడిన నివేదికల ప్రకారం, ఎన్నికల సంఘం లోని మరో ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాల పై 10 నెలల్లో కనీసం 14 సార్లు లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యుల కమిషన్‌గా ఉన్నప్పటికీ, మిగిలిన ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను పక్కనపెట్టి కీలక నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను బలహీనపరచడమేనని విమర్శించారు. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ, సర్ ప్రక్రియ, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి కీలక అంశాల్లో ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయని తెలిపారు. ఓటర్ల డేటాబేస్ క్రమంగా కేంద్రీకృతం కావడం, రాష్ట్ర స్థాయి చట్టబద్ధ అధికారుల పాత్రను పరిమితం చేసే విధంగా సాంకేతిక వ్యవస్థలు మారుతున్నాయన్న ఆందోళనలు కూడా కమిషనర్లు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో దేశ వ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించబడినట్లు వచ్చిన నివేదికలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించకూడదని, ఇప్పటికే తొలగించబడిన అర్హులైన ఓటర్లందరి పేర్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తే విధంగా ఓటర్ల డేటా, సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు కేంద్రీకృతం కాకుండా చట్టబద్ధ మైన స్థానిక అధికారులకు తగిన అధికారాలు ఉండాలని కోరారు. ఈ అంశాల పై సుప్రీంకోర్టులో కూడా సీఈసీ పనితీరు, సర్ ప్రక్రియను సవాలు చేస్తూ పిటిషన్ విచారణకు వచ్చినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం ప్రథమ బాధ్యత అని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ఓటర్ల జాబితాల నుంచి అన్యాయంగా తొలగించబడిన ప్రతి అర్హుడి ఓటు హక్కును పునరుద్ధరించాలని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను నిర్ధారించాలని, సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ఓటు హక్కు పరిరక్షణ కోసం వామపక్షాలు ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే అప్పయ్యమ్మ, కె హేమశ్రీ, గీత, టి నాయుడు, రామలక్ష్మి, వి లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్సీపి సోషల్ మీడియా సైనికుడు చెన్నారెడ్డిని పరామర్శించిన

## మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తమ్ముడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి



**ధర్మవరం,అక్టోబర్ 10 (పెన్ సత్తా)** పట్టణానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సైనికుడు చెన్నారెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి పట్టణంలోని దేవీ నర్సింగ్ హోమ్ హాస్పిటల్ నందు సర్జరీ అనంతరం చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తమ్ముడు కేతిరెడ్డి వెంకటయ్య కృష్ణారెడ్డి స్వయంగా వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిపై వారు ఆరా తీశారు. ఆరోగ్యమును జాగ్రత్తగా కాపాడుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ హిందూపురం పార్లమెంట్ నిర్వాహక్ దళ్ సభ్యులుగా



## అడ్డగిరి శ్యామ్ కుమార్ ఎంపిక

**ధర్మవరం,అక్టోబర్ 10 (పెన్ సత్తా)**జనసేన పార్టీ హిందూపురం పార్లమెంట్ నిర్వాహక సభ్యులుగా ధర్మవరం జనసేన పార్టీకి చెందిన అడ్డగిరి శ్యామ్ కుమార్ ను జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.ఈ సందర్భంగా అడ్డగిరి శ్యాం కుమార్ మాట్లాడుతూ,నాకు ఇచ్చిన ఈ పార్లమెంట్ నిర్వాహక సభ్యునిగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సమన్వయకర్తలు చిలకం మధుసూదన్ రెడ్డి,నవీన్ నిచ్చల్, అమర్ కార్తికేయ కు కృతజ్ఞతలు తెలియజేశారు.స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అభివృద్ధి పరుస్తానని తెలిపారు.

# ధర్మవరం పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ఆదిమూర్తి నియామకం

**ధర్మవరం,అక్టోబర్ 10 (పెన్ సత్తా)** భారతీయ జనతా పార్టీ ధర్మవరం పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా గంపన్నగారి ఆదిమూర్తిని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు శేఖర్ వెల్లడించారు. ధర్మవరం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ నియామకాన్ని ప్రకటించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయ సాధనకు,సమాన అవకాశాల కల్పనకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ కార్యకర్తలకు వివరించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం నూతనంగా నియమితులైన ఆదిమూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఎస్సీ మోర్చాను పట్టణంలో మరింత బలోపేతం చేయాలని,ప్రతి వార్డు, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించాలని నాయకులు సూచించారు.ఎస్సీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా నూతన



అధ్యక్షుడు ఆదిమూర్తి మాట్లాడుతూ,తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన మంత్రి సత్య కుమార్ యాదవ్,జిల్లా అధ్యక్షులు జి.యం శేఖర్,మంత్రి నియోజకవర్గం ఇంచార్జ్ హరీష్ బాబు,జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు,పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్ కి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ,ఎస్సీ మోర్చాను బలోపేతం చేయడానికి,ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బీరే విజయలక్ష్మి,మహిళా మోర్చా అధ్యక్షురాలు జగ్గా నాగరత్నమ్మ,
ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అనిల్ కుమార్,జింకా ప్రవీణ్,చిల్లవారి పల్లి శివయ్య,చిగిచెర్ల ఆదెప్ప,రమేష్ , మైనార్టీ నాయకులు నబిరసూల్,పాలగిరి వరలక్ష్మి మంజుల బాయి,మహాలక్ష్మి,
నాగభూషణాచారి, మహేష్,చెన్నా ఆదినారాయణ, చరణ్,షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో జూలై 15 వరకు నమోదైన ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు వైయస్ఆర్సీపీ విజ్ఞప్తి.
- పాత ఓటరు జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తే లక్షలాది మందికి అన్యాయం:
- ఎస్ఈసీకి వైయస్సార్సీపీ జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి లేఖ
- అర్హులైన ప్రతి పౌరుడికీ ప్రజాస్వామ్య హక్కు దక్కాలి :
- నవీకరించిన ఓటర్ల జాబితాను తక్షణమే ప్రకటించాలి
- లేళ్ల అప్పిరెడ్డి డిమాండ్.

**తాడేపల్లి : (పెన్ సత్తా)**ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 2026 జూలై 15వ తేదీ వరకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఓటరు జాబితాలో చట్టబద్ధంగా నమోదైన అర్హులైన పౌరులందరినీ స్థానిక ఓటర్ల జాబితాలో చేర్చి, వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను (ఎస్ఈసీ) కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు, కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయన ఒక లేఖ రాశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 2026 ఫిబ్రవరి 5వ తేదీ నాటి పాత ఓటరు జాబితాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుంటే, ఆ తర్వాత జూలై 15 వరకు నియమనిబంధనల ప్రకారం పేర్లు నమోదు చేసుకున్న వేలాది మంది అర్హులైన ఓటర్లు తమ ప్రాథమిక హక్కును కోల్పోతారని ఆ లేఖలో లేళ్ల అప్పిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పించేలా, సంబంధిత అనుబంధ మార్పులతో కూడిన తాజా జాబితాను తగినంత ముందుగానే ప్రచురించాలని ఆయన ఎన్నికల కమిషన్ కు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఇంకా లేఖలో ఏయే అంశాలు ప్రస్తావించారంటే..

జూలై 15 వరకు నమోదైన ఓటర్లను పరిగణనలోకి తీసుకోవాలి:

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం, 2026 జూలై 15వ తేదీ వరకు భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాలో నమోదైన అర్హులైన ఓటర్లందరినీ స్థానిక సంస్థల ఎన్నికల జాబితాలో చేర్చాలని కోరుతున్నాను. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రారంభమైన తేదీగా పేర్కొన్న 2026 జూలై 15వ తేదీ తర్వాత ఓటరు నమోదు ప్రక్రియ నిలిపివేయబడినట్లు భావిస్తున్నాం. కాబట్టి ఆ తేదీ వరకు నమోదైన వారిని తప్పనిసరిగా చేర్చాలి.

ఫిబ్రవరి 5 నాటి పాత జాబితాతో అన్యాయం:

ఈ ఎన్నికల కోసం కేవలం 2026 ఫిబ్రవరి 5వ తేదీ నాటి ఓటరు జాబితాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ తేదీ వరకే జాబితాను పరిమితం చేయడం వల్ల, 2026 జూలై 15 వరకు భారత ఎన్నికల సంఘం రికార్డుల్లో చట్టబద్ధంగా పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ, ఆ తర్వాత జాబితాలో చేరిన పౌరులందరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని పూర్తిగా కోల్పోతారు.

ప్రజాస్వామ్య హక్కును కాలరాయవద్దు:

ఈ ఓటర్లందరూ నిర్దేశిత నమోదు ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేశారు. వారి పేర్లు ఇప్పటికే అధికారిక ఓటరు రికార్డుల్లో నమోదై ఉన్నాయి. తదనంతరం ఆమోదించబడిన చేర్పులను పరిగణనలోకి తీసుకోకుండా, పాత ఓటరు జాబితాతోనే ముందుకు వెళ్లడం వల్ల అర్హులైన పౌరులు




తమ ప్రాథమిక ఓటు హక్కును కోల్పోవలసి వస్తుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనే సమాన అవకాశం ప్రతి అర్హుడైన ఓటరుకూ కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది.

స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చి, జాబితాను ముందే ప్రచురించాలి:

ఈ నేపథ్యంలో 2026 జూలై 15వ తేదీ వరకు నవీకరించబడిన ఓటరు జాబితాలను, సంబంధిత అనుబంధంగా ఆమోదించబడిన మార్పులతో సహా వెంటనే స్వీకరించాలి. క్షేత్రస్థాయి అధికారులకు ఈ అంశంపై స్పష్టమైన, ఏకరూప మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, నవీకరించిన స్థానిక సంస్థల ఓటరు జాబితాలను తగినంత ముందుగానే ప్రచురించాలి. తద్వారా ఓటర్లు తమ పేర్లను సరిచూసుకోవడంతో పాటు, ఏవైనా పేర్లు గల్లంతై ఉంటే వాటిని సరిచేసుకునే అవకాశం లభిస్తుందని లేళ్ల అప్పిరెడ్డి ఆ లేఖలో స్పష్టం చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై ఇప్పటికీ చంద్రబాబు పచ్చి మోసం

- మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజం
- రాజమండ్రిలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ
- తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో బీసీ బిల్లును ఎందుకు చేర్చడం లేదు?
- బీసీలకు జరిగిన అన్యాయంపై మంత్రులు సమాధానం చెప్పాలి
- చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ డిమాండ్




**రాజమండ్రి రూరల్: (పెన్ సత్తా)** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి, బీసీల రిజర్వేషన్ల హామీని అమలు చేయడం కోసం చట్ట సవరణకు అవకాశం ఉన్నప్పటికీ చంద్రబాబు ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వైఎస్సార్సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూటిగా ప్రశ్నించారు. రాజమండ్రిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో తన అనుయాయుల ప్రయోజనాల కోసం చట్టాలు తెచ్చుకోగలిగిన చంద్రబాబుకు, తనను అధికారంలోకి తెచ్చిన బీసీల కోసం అవే చట్టబద్ధమైన చర్యలు చేపట్టడానికి ఎందుకు మనసు రాలేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీని నీరుగార్చి బీసీలకు తీవ్రమైన వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. గతంలో జగన్ గారి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు ఎక్కడా అన్యాయం జరగకుండా అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తే, నేడు వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని దుయ్యబట్టారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక, ఎంపిరికల్ డేటా, రిజర్వేషన్లపై న్యాయస్థానాల తీర్పుల విషయంలో ప్రభుత్వం అనుసరించిన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేయడానికి కేంద్రంలో తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించకుండా, హామీలను అమలు చేయడంలో చంద్రబాబు వెనకడుగు వేస్తున్నారని ఆక్షేపించారు. అశాస్త్రీయ విధానాలతో బలహీన వర్గాల హక్కులను కాలరాస్తున్న పాలకులకు బీసీ సమాజం త్వరలోనే తగిన గుణపాఠం చెబుతుందని చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ హెచ్చరించారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే...

తమిళనాడు తరహాలో ఎందుకు చేయడం లేదు?:

గతంలో చంద్రబాబు తన రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే బిర్రు ప్రతాప్ రెడ్డి వంటి వారి ద్వారా కోర్టుల్లో పిటిషన్లు వేయించి, బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేలా కుట్రలు చేశాడు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న ఈ ప్రభుత్వం తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లపై చట్టసవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ పని ఎందుకు చేయడం లేదు? అబద్ధాలతో రాజకీయాలు చేస్తూ, అధికారం దక్కించుకున్న తర్వాత ప్రజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ప్రజాస్వామ్యంలో అబద్ధాల ద్వారా అధికారాన్ని సాధించి, బలహీన వర్గాల జీవితాలతో ఆడుకుంటే సమాజానికి క్యాన్సర్‌లాంటి ప్రమాదం పొంచి ఉంటుంది. అచ్చెన్నాయుడు, పార్థసారధి, అనగాని సత్యప్రసాద్ వంటి బీసీ మంత్రులు, నాయకులు ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇప్పటికైనా కళ్ళు తెరిచి తమ ప్రభుత్వాన్ని నిలదీయాలి. త్వరలోనే ఈ రిజర్వేషన్ల మోసానికి సంబంధించి మరిన్ని సంచలన విషయాలతో మరోసారి ప్రత్యేక ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబు డ్రామాలను పూర్తిగా ఎండగడతాం.

ప్రజలను చంద్రబాబు తప్పుదోవ పట్టిస్తున్నాడు:

చంద్రబాబు బీసీలకు వెన్నుపోటు పొడిచారు.. ఈ చరిత్రలో ఆ మచ్చ మిగిలిపోతుంది. ఎన్నికలకు ముందు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు 24 శాతం, 27 శాతం అంటూ భిన్నమైన వాదనలు వినిపించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయడంపై న్యాయపరమైన పరిమితులు ఉన్న నేపథ్యంలో, శాస్త్రీయమైన కుల గణాంకాలు, ఎంపిరికల్ డేటా, డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా ముందుకు వెళ్లాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయలేదు. కమిషన్ నివేదికను పూర్తిగా ఆమోదించకుండా, అందులోని కొన్ని అంశాలను మాత్రమే తీసుకుని జీవో జారీ చేయడం వల్లే న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బలు తగిలాయి. పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశ పరిచి అమరావతికి చట్టబద్ధత తీసుకురాగా, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగపరమైన పరిష్కారం ఎందుకు తీసుకురాలేక పోయారో చంద్రబాబు సమాధానం చెప్పాలి.

అబద్ధాలతో పాలన క్యాన్సర్ కన్నా ప్రమాదం:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వేషన్ల పరిమితుల కారణంగా ఎక్కడైనా తగ్గుదల ఏర్పడిన సందర్భాల్లో పార్టీ పరంగా బీసీలకు అదనపు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. ఆ మేరకు మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ పదవుల్లో బీసీలకు గణనీయమైన అవకాశాలు కల్పించడం జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం అబద్ధపు ప్రచారంతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు హామీల అమలులో ద్రోహానికి పాల్పడుతోంది. అబద్ధాలతో అధికారం సాధించి, అబద్ధాలతోనే పాలన సాగిస్తే సమాజానికి క్యాన్సర్‌లాంటి ప్రమాదం. బీసీ మంత్రులు తమ ముఖ్యమంత్రిని నిలదీసి, బీసీల హక్కుల కోసం కేంద్రంతో పోరాడాలి. రిజర్వేషన్ల అంశంపై న్యాయనిపుణులు, బీసీ సంఘాలు సమగ్రంగా చర్చించాలి. తమిళనాడు తరహాలో రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే దిశగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ డిమాండ్ చేశారు.

# మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మోదీని మొగాంబోగా అభివర్ణిస్తూ– ఆయన భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి చేసిన నేరాలకు ప్రధాని మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడంతో పాటు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని రాహుల్ విమర్శించారు. చెన్నైలో శనివారం యువతతో ఛాత్రోన్ కీ గూంజ్ (విద్యార్థుల గళం) ఆరో ఎడిషన్ కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దేశ రాజధాని దిల్లీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ – నగరమంతా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పోలీసులు విద్యార్థులపై దాడులు చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ కూడా తన అనుచరుల ద్వారా విద్యార్థులపై దాడులు చేయించిందని విమర్శించారు.

‘మోదీ సమస్య ఏంటంటే– ఆట ముగిసిపోయిందని ఆయన అర్థం చేసుకోవడం లేదు. గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది. దేశానికి చేసిన నేరాలకు మోదీ మూల్యం చెల్లించేలా మేం చేస్తాం’

ఇక్కడ రాహుల్ గాంధీ ప్రధానిని మొగాంబోతో పోల్చారు. ప్రముఖ బాలీవుడ్ చిత్రం మిస్టర్ ఇండియాలోని విలన్ పాత్ర పేరు మొగాంబో. దివంగత నటుడు అమ్రిష్ పురి పోషించిన ఆ పాత్రను ప్రస్తావిస్తూ మొగాంబో మోదీ అని అన్నారు. రాహుల్ దీని గురించి మాట్లాడే సమయంలో వెనుక స్క్రీన్‌పై 1987లో విడుదలైన మిస్టర్ ఇండియా సినిమాలోని దృశ్యాన్ని కూడా ప్రదర్శించారు. అందులో అమ్రిష్ పురి ముఖానికి



బదులుగా మోదీ ముఖాన్ని మార్ఫింగ్ చేసి చూయించారు.

తమిళ సంస్కృతి, భాషపై మోదీ దాడి చేస్తున్నారు: రాహుల్

ఇక ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా– తమిళనాడు సంస్కృతి, భాష సహా చరిత్రపైనా దాడి ప్రారంభించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఆరోపించారు. తమిళనాడుపై హిందీని రుద్దుతామని అమిత్ షా బహిరంగంగా చెబుతున్నారని విమర్శించారు. కొత్త జాతీయ విద్యా విధానం (చీఙూ) ద్వారా 3 భాషల విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్నే అణచివేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. తమిళనాడును ఇంకా నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ ద్వారా శిక్షించేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని రాహుల్ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

‘తమిళ సంస్కృతి, భాష, చరిత్రపై మోదీ దాడి చేయడాన్ని మేం అనుమతించబోం. ఆయన తమిళనాడును ముట్టుకోలేరు’ అని స్పష్టం చేశారు. తమిళనాడు నేలపైకి రావడం తనకు గౌరవంగా ఉందన్న రాహుల్, ఈ రాష్ట్ర ప్రజల నుంచి తాను తరచూ కొత్త విషయాలు నేర్చుకుంటానని తెలిపారు. ఈ క్రమంలోనే తమిళనాడు సామాజిక సంస్కర్త పెరియార్ బోధనలను రాహుల్ గుర్తుచేశారు. ఇతరులు చెప్పారని ఏ విషయాన్నీ గుడ్డిగా అనుసరించకూడదని, ప్రతి అంశాన్నీ విశ్లేషించి, ప్రశ్నించి తెలుసుకోవాలని పెరియార్ సూచించినట్లు చెప్పారు.

**విద్యార్థులు దేనికీ భయపడొద్దు**

ఇక దేనికి భయపడవద్దనేదే విద్యార్థులకు తాను చెప్పదలుచుకున్న ప్రధాన సందేశం అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రశ్నించడం, ఆసక్తితో తెలియని విషయాలను తెలుసుకోవాలనుకోవడం సమాజ పురోగతికి పునాదులని, ప్రజాస్వామ్యం కూడా ప్రశ్నించే తత్వం నుంచే పుట్టిందని తెలిపారు. విద్యార్థులు స్వేచ్ఛగా ప్రశ్నలు అడగాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు భయపడకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై దాడి చేసిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని పేర్కొన్నారు. ఇక చెన్నైకి ముందు కోటా, దేహ్రాదూన్, ప్రయాగ్ రాజ్, పుణె, ఇండోర్ నగరాల్లో ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమాలను నిర్వహించింది కాంగ్రెస్. ఈ కార్యక్రమం గురించి ఆ పార్టీ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ కూడా స్పందించారు. రాహుల్ చేపట్టిన ఈ కార్యక్రమం రాజకీయ వివాదాలకు పరిమితం కాకుండా, వ్యవస్థలో ఉన్న లోతైన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సాగుతోందని అన్నారు. ప్రస్తుత వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దాంట్లో సమూల మార్పు తీసుకురావాలన్నదే రాహుల్ లక్ష్యమని పేర్కొన్నారు.

# నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్?కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పలువురు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలను నిర్బంధించారు. మరోవైపు, జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7వేల మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు తెలిపారు.

**దీప్కేను విమానంలోనే!**

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి దిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అందుకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమ నాయకులను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని పార్టీ ఆరోపించింది. ఇది పౌర హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది.

**కేజ్రీవాల్, మమతా బెనర్జీ నిర్బంధం**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, దిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్



సహా పలువురు తృణమూల్ నేతలు పాల్గొన్నారు. మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందని, ఇది సూపర్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని పేర్కొన్నారు.

**వామపక్ష నేతలూ అదుపులోకి**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

**ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరు: ఖర్గే**

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య జననిగా ఉన్న వ్యవస్థను నోరు మూసిన ప్రజాస్వామ్యంగా కేంద్ర సర్కార్ మార్చివేసిందని ఆరోపించారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ పిరికితనం నేడు బయటపడిందని ఆరోపించారు. “మన యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ సృష్టికర్తలు ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారు” అంటూ పోస్ట్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లతో భారత ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమితో కలిసి సర్వశక్తులు ఒడ్డి పోరాడుతుందని ఖర్గే చెప్పారు. “భారత స్వాతంత్ర్యం కోసం మేం మా రక్తాన్ని చిందించాం. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి మా శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉంటాం” అని ఖర్గే తెలిపారు.

**మోదీ, షా నడుపుతున్న నియంతృత్వ దేశం: ప్రియాంక గాంధీ**

భారత్? ఇకపై ప్రజాస్వామ్య దేశని కాదని, ప్రధాని మోదీ–అమిత్ షాలు నడుపుతున్న నియంతృత్వమని ఆరోపించారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా. “మొదట వారు 254 మంది ఎంపీలను తీవ్రంగా కొట్టి, వారి ప్రాథమిక రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ పూర్తిగా చట్టవిరుద్ధంగా నిర్బంధిస్తారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నిరసనకారుల పట్ల కూడా వారు అదే విధంగా ప్రవర్తిస్తారు. ఆ తర్వాత వారు జాతీయ రాజధానిని ముట్టడిస్తారు, దానికి బారికేడ్లు పెట్టి అన్ని వైపులా మూసివేస్తారు, రైళ్లు, మెట్రోలను నిలిపివేస్తారు, ఇంటర్నెట్‌ను నిలిపివేస్తారు. అన్నిచోట్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తారు. నిరసన తెలిపే తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుంటున్న యువతీ యువకులను కొట్టి నిర్బంధిస్తారు. ఎన్నికల సంఘం కుమ్మక్కుతో వారు ఎన్నికలలో మోసం చేశారనడానికి, తమ ప్రభుత్వ చట్టబద్ధత బట్టబయలవుతోందని ఇది రుజువు కాకపోతే మరేమిటి? ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి వారితో కుమ్మక్కవుతున్న వారందరూ దేశద్రోహానికి పాల్పడుతున్నారు” అంటూ ఆరోపణలు చేశారు.

**సుప్రీంకోర్టులో విచారణ**

దిల్లీలో సీజేపీ నిరసనల వేళ మెట్రో, రైలు సేవలు పూర్తిగా నిలిపివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాన్ని అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై చర్యలు ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్?పై జస్టిస్ జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం విచారణ చేపట్టనుంది.

## విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి కేసు నమోదు చేసిన ఎన్ఐఏ



దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఆ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన అధికారులు, దాడికి దారితీసిన పరిస్థితులు, విమానాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నం జరిగిందా అనే అంశాలపై దర్యాప్తు చేయనున్నారు. అయితే స్మిత్ మచ్చర్‌పై దాడి చేసిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. భారతీయ పైలట్‌పై దాడి జరగడం, విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా కూల్చివేయడానికి ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరమని భావించింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థకు కేసును అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ అక్టోబర్ 9న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. యాంటీ హైజాకింగ్ చట్టం–2016లోని సంబంధిత నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)–1967 కింద కేసు నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16తో పాటు సెక్షన్ 15(1)(ఎ) నిబంధనలను కూడా ఆ కేసుకు వర్తింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం–2008 ప్రకారం, ఈ కేసులో పేర్కొన్న నేరాలు ఎన్ఐఏ విచారణ చేపట్టేందుకు వీలున్న నేరాల జాబితాలోకి వస్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 6లోని ఉప సెక్షన్లు 5, 8తో పాటు సెక్షన్ 8 కింద తన అధికారాలను ఉపయోగించి దర్యాప్తునకు ఆదేశించింది. ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది. కాక్‌పిట్‌లో అసలు ఏం జరిగింది, దాడికి దారితీసిన పరిస్థితులు ఏమిటి, విమానాన్ని హైజాక్ చేయాలనే ఉద్దేశం ఉందా, విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించారా అనే కోణాల్లో దర్యాప్తు సాగనుంది. ఈ ఘటనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర పరిణామాలు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే కో పైలట్ దాడికి పాల్పడటానికి గల కారణాలు ఏమిటి, ఘటనకు ముందు విమానంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టమైన వివరాలు వెల్లడికాలేదు. దాడి వెనుక ఉద్దేశం ఏమిటనేది కూడా తేలాల్సి ఉంది. ఆ అంశాలన్నింటినీ పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావడమే ఎన్ఐఏ దర్యాప్తు లక్ష్యంగా ఉండనుంది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073 బయలుదేరింది. ఉదయం 7.05 గంటలకు గల్ఫ్ కాలమానం ప్రకారం ప్రయాణం ప్రారంభించింది. ఆ విమానంలో 174 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. విమానానికి భారతీయుడైన కెప్టెన్ స్మిత్ మచ్చర్? నాయకత్వం వహించగా, ఒమన్‌కు చెందిన వ్యక్తి కో పైలట్‌గా ఉన్నారు. విమానం జోర్డాన్–సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతం సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్?పై కో పైలట్ కత్తితో దాడి చేశారు. ఆ దాడి విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా దాన్ని కూల్చివేయడానికి చేసిన ప్రయత్నం అయి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లో జరిగిన దాడిని గుర్తించిన ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడికి పాల్పడిన కో పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. చివరకు అతడిని నిలువరించి కట్టడి చేసినట్లు సమాచారం. ఆ దాడిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్? తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విమానంలో ఇతర ఫ్లైదుబాయ్ పైలట్లు కూడా ఉండటంతో వారు విమాన నియంత్రణ బాధ్యతలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకుని విమానాన్ని సురక్షితంగా దించారు. సౌదీ అరేబియాలోని వాయవ్య ప్రాంతంలో ఉన్న టబుక్‌లోని ప్రిన్స్ సుల్తాన్ బిన్ అబ్దుల్ అజీజ్ విమానాశ్రయానికి ఉదయం సుమారు 10.45 గంటలకు విమానం చేరుకుంది. అనంతరం దాడికి పాల్పడిన సహ పైలట్‌ను సౌదీ అధికారులు అరెస్టు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం వెల్లడించింది.

## పాకిస్థాన్‌లో మరో దారుణం..



పాకిస్థాన్‌లో మతపరమైన మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో దైవదూషణ ఆరోపణలతో ఓ క్రైస్తవుడి ఇల్లు, దుకాణానికి ముస్లిం మూక నిప్పుపెట్టింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు ప్రాణభయంతో తమ ఇళ్లను విడిచి సురక్షిత ప్రాంతాలకు పారిపోయాయి. క్రిస్టియన్ డైలీ ఇంటర్నేషనల్–మార్నింగ్ స్టార్ న్యూస్ కథనం ప్రకారం పంజాబ్ ప్రావిన్స్‌లోని షేఖుపురా జిల్లా, ఘరియల్ కలాన్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. గ్రామంలో ఫార్మసీ నడుపుతున్న కమ్రాన్ మసీహ్ (40) అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో దైవదూషణకు సంబంధించిన వీడియోను షేర్ చేశాడని స్థానిక ముస్లింలు ఆరోపించారు. ఈ ఆరోపణలతో గురువారం రాత్రి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలియగానే శుక్రవారం రోజున వందలాది మంది ముస్లింలు కమ్రాన్ దుకాణం, ఇంటి వద్ద గుమిగూడారు. కొద్దిసేపటికే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు వ్యక్తులు ఆ రెండు భవనాలకు నిప్పుపెట్టారు. కమ్రాన్ అరెస్టు, ఆస్తుల ధ్వంసం వార్త తెలియగానే, గ్రామంలోని ఇతర క్రైస్తవ కుటుంబాలు మూకదాడులు జరగవచ్చనే భయంతో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కమ్రాన్‌పై దైవదూషణ చట్టంలోని ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారనే దానిపై స్పష్టత లేదని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్రైస్తవుల ఆస్తులు, నివాసాలకు రక్షణ కల్పించేందుకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించినట్లు షేఖుపురా జిల్లా పోలీస్ కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉన్నందున, దర్యాప్తు వివరాలు వెల్లడించలేమని ఓ అధికారి తెలిపారు.

**దుర్వినియోగమవుతున్న దైవదూషణ చట్టాలు**

పాకిస్థాన్‌లో దైవదూషణ చట్టాలు తరచూ దుర్వినియోగం అవుతున్నాయని, వ్యక్తిగత కక్షలు, తగాదాల కోసం వీటిని వాడుకుంటున్నారని మానవ హక్కుల సంఘాలు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలే లక్ష్యంగా ఈ చట్టాలను ప్రయోగిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా నమోదైన 333 దైవదూషణ కేసుల్లో చాలా వరకు తప్పుడువని ఇటీవల ఓ పార్లమెంటరీ కమిటీకి అధికారులు నివేదించారు. అత్యధికంగా పంజాబ్ ప్రావిన్స్‌లోనే 116 కేసులు నమోదైనట్లు అధికారిక డేటా వెల్లడించింది. చాలా కేసుల్లో ఆరోపణలకు సరైన ఆధారాలు లేకపోవడంతో కొట్టివేసినట్లు అధికారులు కమిటీకి తెలిపారు. దైవదూషణ చట్టాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో, మైనారిటీలను రక్షించడంలో పాక్ ప్రభుత్వం విఫలమవుతోందని ‘వాయిస్ ఆఫ్ పాకిస్థాన్ మైనారిటీ’ వంటి సంస్థలు ఆరోపిస్తున్నాయి.

## ‘గెలిస్తే నిజాయతీ- ఓడితే అవకతవకలా’




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ దిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, అలానే భారత ఎన్నికల విధానాన్ని సమర్థిస్తూ దేశానికి చెందిన 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వల్ల ప్రజాస్వామ్య సంస్థలపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని, అంతేకానీ నిరాధారంగా ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యారని ప్రచారం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు.

**నమ్మకాన్ని దెబ్బతీస్తున్నట్లే!**

దిల్లీలో శనివారం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వెంట్ల బృందం లేఖ విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారము కాదని మాజీ అధికారులు లేఖలో స్పష్టం చేశారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ వంటి బాధ్యతలను ఎన్నో సార్లు నిర్వహించామని గుర్తుచేశారు. ‘అసలు ఎలాంటి ఆధారాలు లేకుండా మన ఎన్నికలను రిగ్గింగ్ అంటూ ఒక పదాన్ని పదేపదే ఉపయోగిస్తున్నారు. ప్రతిసారీ అలా అనడం ప్రజాస్వామ్యంపై మనందరికీ ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది’ అని లేఖలో పేర్కొన్నారు.

**గెలిస్తే నిజాయతీ- ఓడితే అవకతవకలా?**

ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే వ్యవస్థ నిజాయతీగా ఉందని, అదే ఓటమి ఎదురైనప్పుడు అక్రమాలు, అవకతవకలకు పాల్పడిందని చెప్పడం సరికాదని మాజీ అధికారులు ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించారు. ‘వ్యవస్థపై మీకు అనుమానమా? లేక ఫలితంపైనా?’ అని ప్రశ్నిస్తూ, తగిన ఆధారాలేం లేకుండా తప్పుడు కథనాలను ప్రచారం చేయడం వల్ల ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని అన్నారు.

**బిహార్ ఎన్నికలే ఉదాహరణ!**

ఎన్నికల నిర్వహణలో వచ్చిన మార్పులకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా మాజీ అధికారులు పేర్కొన్నారు. బిహార్ చరిత్రలోనే తొలిసారిగా అక్కడ ఒక్క రీపోలింగ్ కూడా అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళలు కూడా రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు లేఖలో గుర్తుచేశారు. అధికారులు పూర్తిగా మారిపోయినందువల్లే ఇది సాధ్యమైందని కాదని, ఎన్నికల సంఘం రూపొందించిన వ్యవస్థలో పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. ఇక ఈవీఎంలు, స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత గురించి ప్రస్తావించిన మాజీ అధికారులు– ప్రతి అభ్యర్థి తరఫున ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రక్రియను గమనించగలరని, పోలైన ఓట్ల లెక్కకు సంబంధించిన సంతకం చేసిన వివరాల్ని కూడా అందుకుంటారని తెలిపారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలోనే ఈవీఎంలను సీల్ చేస్తారని, ఆ సీల్స్‌పైనా వారి సంతకాలు ఉంటాయని వివరించారు. తర్వాత యంత్రాలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరుస్తారని, అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు వాటి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. .

**ముగ్గురు ఉండడం కరెక్టే**

ఎన్నికల సంఘంలో ముగ్గురు కమిషనర్లు ఉండటాన్ని కూడా మాజీ అధికారులు సమర్థించారు. 1995లో సుప్రీం కోర్టు దీనిని సమర్థించిందని, ఒకే వ్యక్తి చేతిలో అధికారం కేంద్రీకృతం కాకుండా ఉండటానికే ఈ విధానం ఉందని తెలిపారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఉండటం వల్ల కీలక నిర్ణయాలపై సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోలేరని అభిప్రాయపడ్డారు.

ప్రపంచం యుద్ధాల అంచున ఊగిసలాడుతున్న వేళ నోబెల్ శాంతి నిర్ణయం వచ్చింది. అంతర్జాతీయ చట్టాలు అగ్రరాజ్యాల అహంకారం ముందు కాగితం పులులుగా మిగిలిపోతున్న సమయంలో నార్వే నోబెల్ కమిటీ సాహసోపేతమైన, అర్థవంతమైన ఎంపిక చేసింది. 2026 నోబెల్ శాంతి పురస్కారాన్ని దక్షిణాఫ్రికాకు చెందిన (భారత మూలాలున్న) న్యాయకోవిదురాలు నవనీతం 'నవీ' పిళ్లైకి ప్రకటించింది. శాంతి అంటే కేవలం తుపాకుల మోత ఆగిపోవడం కాదని, న్యాయం నిలబడటమేనని ఈ ఎంపిక ద్వారా ప్రపంచానికి గుర్తు చేసింది. నవీ పిళ్లై జీవితం ఒక పోరాట గాథ. పందొమ్మిదో శతాబ్దంలో తమిళనాడునుంచి ఒప్పంద కూలీలుగా దక్షిణాఫ్రికాలోని నాటల్ చెరకు తోటలకు వలస వెళ్లిన పేద కుటుంబాల వారసురాలు ఆమె. 1941లో డర్బన్‌లో ఒక బస్సు డ్రైవర్ ఇంట్లో పుట్టారు. వర్ణవివక్ష రాజ్యమేలుతున్న సమాజంలో ఒక నల్లజాతి మహిళ న్యాయవాది కావడమే అప్పట్లో అసాధ్యం. అయినా పట్టుదలతో చదువుకున్నారు. స్థానిక భారతీయ సమాజమే చందాలు వేసి ఆమె చదువుకు అండగా నిలిచింది. చదువు పూర్తయ్యాక ఏ న్యాయ సంస్థా ఆమెకు ఉద్యోగం ఇవ్వలేదు. దాంతో 1967లో నాటల్ ప్రావిన్స్‌లో సొంతంగా న్యాయవాద కార్యాలయం తెరిచిన తొలి నల్లజాతి మహిళగా చరిత్ర సృష్టించారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు వర్ణవివక్ష వ్యతిరేక ఉద్యమకారుల తరఫున కోర్టుల్లో వాదించారు. పోలీసు చిత్రహింసలను సవాల్ చేశారు. నెల్సన్ మండేలా వంటి నేతలు బందీలుగా ఉన్న రాబెన్ ఐలాండ్ జైలు ఖైదీల హక్కుల కోసం పోరాడారు. ఆమె ధైర్యాన్ని దగ్గరి నుంచి చూసిన మండేలా.. అధ్యక్షుడయ్యాక 1995లో స్వయంగా ఆమెను దక్షిణాఫ్రికా హైకోర్టులో తొలి నల్లజాతి మహిళా న్యాయమూర్తిగా నియమించారు. అదే ఏడాది రువాండా మారణహోమంపై ఏర్పాటైన అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో న్యాయమూర్తిగా చేరి తర్వాత దానికి అధ్యక్షురాలయ్యారు. అక్కడే 1998లో ఆమె భాగస్వామిగా ఉన్న ధర్మాసనం ఒక చారిత్రక తీర్పునిచ్చింది. యుద్ధాల్లో మహిళలపై జరిగే అత్యాచారం కూడా మారణహోమ చర్యే అవుతుందని అంతర్జాతీయ న్యాయ చరిత్రలో తొలిసారి తేల్చి చెప్పింది. ఆ తర్వాత ఐసీసీ న్యాయమూర్తిగా, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు. మహిళలు, చిన్నారులపై జరిగే లైంగిక హింసకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు.

నోబెల్ ఎంపిక ప్రాధాన్యం అర్థం కావాలంటే ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని చూడాలి. ఉక్రెయిన్‌లో ఏళ్ల తరబడి రక్తపాతం కొనసాగుతోంది. సూడాన్‌లో అంతర్యుద్ధం రగులుతోంది. పశ్చిమాసియాను ఇరాన్ యుద్ధం అగ్నిగుండంగా మారుస్తోంది. ఇలాంటి సమయంలో అంతర్జాతీయ చట్టాన్ని సజీవంగా, ప్రాసంగికంగా ఉంచేందుకు నవీ పిళ్లై చేస్తున్న కృషిని నోబెల్ కమిటీ ప్రత్యేకంగా ప్రస్తావించింది. శాంతియుత ప్రపంచాన్ని కోరుకునే వారందరికీ ఆమె కృషి ఆశాదీపమని కొనియాడింది. ఆమె నేతృత్వంలోని ఐరాస స్వతంత్ర విచారణ కమిషన్ గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని గత ఏడాది నిర్ధారించింది. హమాస్ దాడికి ప్రతిస్పందన పేరిట వేలాది సామాన్యులను, పసిపిల్లలను బలిగొన్న అతి తీవ్ర సైనిక చర్యను ప్రశ్నించడానికి గుండె ధైర్యం

## శాంతి 'నవనీతం'

కావాలి. అంతులేని యుద్ధాల ప్రస్తుత కాలంలో దురాక్రమణను దురాక్రమణ అని పిలిచే ధైర్యమే ఒక అవసరంగా మారింది. ఆ ధైర్యాన్నే నోబెల్ కమిటీ సత్కరించింది. ఈ ఎంపిక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కమిటీపై తెచ్చిన ఒత్తిళ్లకు పూర్తి భిన్నమైన సమాధానం కూడా. ఈ పురస్కారం తనకే దక్కాలని ట్రంప్ అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా పదే పదే చెప్పుకుంటూ వచ్చారు. ఐరాస వేదికపై నుంచే తన పేరును తానే సిఫార్సు చేసుకున్నారు. కానీ కమిటీ తలొగ్గలేదు. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించాలని ఆదేశించింది ట్రంపే. 2026లో ఆ దేశంపై పూర్తిస్థాయి వైమానిక యుద్ధానికి తెరలేపిందీ ఆయనే. అలాంటి వ్యక్తి శాంతిదూత బిరుదుకు అత్యంత అనర్హుడన్నది స్పష్టం. గత ఏడాది నోబెల్ గ్రహీత, వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడో తన పతకాన్ని ఓవల్ ఆఫీసులో ట్రంప్ చేతికి అందించడం కూడా కమిటీకి నచ్చి ఉండకపోవచ్చు. -ఎవరి ఒత్తిళ్లకూ లొంగని ఒక న్యాయమూర్తిని నోబెల్ కమిటీ ఎంచుకోవడం యాదృచ్ఛికం కాదు.

ఈ పురస్కారంలో భారత్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వైచిత్రి ఉంది. ప్రధాని మోదీతో గొప్ప స్నేహముందని ట్రంప్ చెప్తుంటారు. కానీ ప్రతి అడుగులోనూ

## సంపాదకీయం

భారత్‌ను ఇబ్బంది పెడుతున్నారు. భారతీయ ఎగుమతులపై భారీ సుంకాలు విధించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణ తన మధ్యవర్తిత్వం వల్లే జరిగిందని పదే పదే చెప్పుకున్నారు. భారత్ ఆ వాదనను స్పష్టంగా తోసిపుచ్చినా ఆయన అదే పాట పాడుతూ వచ్చారు. అలాంటి నేత కలలుగన్న పురస్కారం చివరకు భారత మూలాలున్న ఒక మహిళ చేతికి చేరడం సన్నివేశ వైచిత్రికి పరాకాష్ఠ. మరో చారిత్రక సారూప్యతనూ గుర్తు చేసుకోవాలి. దాదాపు నూట ముప్పై ఏళ్ల క్రితం యువ న్యాయవాది మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ ఇదే నాటల్ గడ్డపై జాతి వివక్షకు వ్యతిరేకంగా సత్యాగ్రహ ఆయుధాన్ని తొలిసారి ప్రయోగించారు. అదే డర్బన్ మట్టిలో పుట్టిన నవీ పిళ్లై న్యాయాన్నే ఆయుధంగా చేసుకుని పోరాడారు. ఐదుసార్లు నామినేట్ అయినా గాంధీజీ నోబెల్ శాంతి బహుమతిని అందుకోలేకపోయారు. ఆ లోటు ఆయన స్ఫూర్తికి వారసురాలైన ఒక భారత సంతతి మహిళ ద్వారా కొంతైనా పూడినట్లయింది. అయితే మనం గర్వపడాల్సింది కేవలం ఆమె మూలాల గురించి కాదు, ఆమె నిలబెట్టిన విలువల గురించి. బలవంతుడిదే రాజ్యం అనే సిద్ధాంతం మళ్లీ తలెత్తుతున్న ఈ రోజుల్లో చట్టమే అందరికంటే బలమైనదని ఆమె జీవితం చాటుతోంది. పెద్ద దేశాలు తమకు అనుకూలమైనప్పుడు అంతర్జాతీయ చట్టాన్ని పొగడటం, ప్రతికూలమైనప్పుడు పక్కన పడేయడం పరిపాటిగా మారింది. అలాంటి కాలంలో ఈ పురస్కారం ప్రపంచ నాయకులకు ఒక సూటి సందేశం. శాంతి అంటే బాంబులతో ప్రత్యర్థిని లొంగదీసుకోవడం కాదు. బాధితులకు న్యాయం జరిగేలా చూడటం, దోషులను జవాబుదారీ చేయడమే అసలైన శాంతి. ప్రపంచ వేదికపై 'విశ్వగురువు'గా ఎదగాలని ఆశిస్తున్న భారత్ కూడా అంతర్జాతీయ చట్టాల పరిరక్షణలో మరింత స్పష్టమైన, నైతికమైన గళం వినిపించాలి. డిసెంబర్ 10న ఓస్లోలో జరిగే వేడుకలో ఆ పతకం ఆమె చేతికి చేరనుంది. ఈసారి అది సరైన చేతుల్లోకే వెళ్తోంది. మరెవరి చేతుల్లోకీ బదిలీ కాదని కూడా గట్టిగా నమ్మవచ్చు.

### పనికొచ్చే పలుకు



## 'ఫ్లెక్స్' వద్దు.. ఫ్యూచర్ ముద్దు!

ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేస్తే చాలు, ఒకరు గోవా ట్రిప్ రీల్ పెడతారు. మరొకరు కొత్త ఐఫోన్ అన్‌బాక్సింగ్ వీడియో పోస్ట్ చేస్తారు. ఇంకొకరు ఖరీదైన కేఫ్‌లో బ్రంచ్ ఫొటోలు షేర్ చేస్తారు. ఇవన్నీ చూస్తుంటే మనకు తెలియకుండానే లోపల ఒత్తిడి మొదలవుతుంది. 'అందరూ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు, నేను మాత్రమే వెనకబడిపోయాను' అనిపిస్తుంది. దీన్నే ఈతరం భాషలో 'ఫోమో' (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్) అంటారు. ఆ భయంతోనే చాలామంది 'బై నౌ పే లేటర్' ఆప్షన్ నొక్కేస్తారు. క్రెడిట్ కార్డు స్వైప్ చేసేస్తారు. జీతం అకౌంట్‌లో పడకముందే ఈఎంఐలు కాచుకు కూర్చుంటాయి. నెల మధ్యలోనే బ్యాలెన్స్ సున్నాకు చేరుతుంది. మళ్లీ జీతం కోసం ఎదురుచూపులు. ఇదొక అంతులేని లూప్!

ఈ లూప్‌నుంచి బయటపడాలని నిర్ణయించుకున్న రోజు మీ జీవితంలో నిజమైన మలుపు. కానీ ఒక చిన్న ట్విస్టుంది. ఆ మార్పు ఎవరి కంటికీ కనిపించదు. మీరు పాత అప్పులు తీర్చడం మొదలెడతారు. వీకెండ్ పార్టీలకు 'నో' అంటారు. ప్రతి నెలా కొంత డబ్బు పొదుపుకు, పెట్టుబడికి మళ్లిస్తారు. అప్పుడు మీ ఫ్రెండ్స్ 'వీడు పిసినారైపోయాడురా' అని గ్రూప్ చాట్‌లో జోకులేస్తారు. బంధువులేమో 'పాపం, ఇంకా సెటిల్ కాలేదు' అని జాలి పడతారు. పాత బైక్‌నే నడుపుతున్నావేంటని, అదే ఫోన్ ఇంకా వాడుతున్నావేంటని ప్రశ్నిస్తారు.

వాళ్లను అలాగే అనుకోనివ్వండి. ఎందుకంటే నిజమైన సంపద ఎప్పుడూ గోల చేయదు. నిశ్శబ్దంగా, చడీచప్పుడు లేకుండా పెరుగుతుంది. ఒక విత్తనం మట్టిలో వేర్లు పాతుకునే దశలో పైకి ఏమీ కనిపించదు. వెదురు మొక్క కూడా మొదటి కొన్నేళ్లు భూమి లోపలే బలపడుతుంది. తర్వాతే ఒక్కసారిగా ఆకాశంవైపు దూసుకెళ్తుంది. మీ పొదుపు కూడా అంతే. చక్రవడ్డీ (కాంపౌండింగ్) అనే మ్యాజిక్ ఓపిక పట్టినవాళ్లకే ఫలితం చూపిస్తుంది. ఇరవైల్లో నెలనెలా చిన్న మొత్తాలతో మొదలుపెట్టిన పొదుపు ముప్పైల చివరికి వచ్చేసరికి మీకు ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేని స్వేచ్ఛనిస్తుంది. అదే అసలైన 'ఫ్లెక్స్'.

ఇక్కడ ఒక విషయం అర్థం చేసుకోవాలి. ఖర్చు చేయడం వేరు, సంపన్నుడిగా ఉండటం వేరు. ఖరీదైన కారు ఉన్నవాడు ధనవంతుడని అనుకుంటాం. కానీ ఆ కారు ఈఎంఐ మీద ఉంటే అది అతని సంపద కాదు, బ్యాంకుది. కనిపించే వైభవం చాలాసార్లు అప్పుల పునాదిపైనే నిలబడి ఉంటుంది. కనిపించని సంపదే అసలైన భద్రత. ఉద్యోగం పోయినా, అనారోగ్యం వచ్చినా, ఆకస్మిక అవసరం ఎదురైనా తట్టుకుని నిలబడే శక్తి దానికే ఉంటుంది.

మరి లైఫ్‌స్టయిల్‌ను ఎలా మార్చుకోవాలి? ముందుగా 'అవసరం', 'కోరిక' మధ్య తేడా గుర్తించండి. ఏదైనా కొనాలనిపించినప్పుడు ఒక రోజు ఆగండి. ఇరవై నాలుగు గంటల తర్వాత కూడా అది అవసరం అనిపిస్తేనే కొనండి. చాలా కోరికలు ఆ ఒక్క రోజులోనే ఆవిరైపోతాయి. రెండోది, జీతం రాగానే ముందు మీకు మీరే చెల్లించుకోండి. అంటే పొదుపు మొత్తాన్ని పక్కన పెట్టిన తర్వాతే మిగిలిన డబ్బుతో ఖర్చులు చేయండి. మూడోది, ఇతరుల హైలైట్ రీల్స్‌తో మీ బిహైండ్-ద-సీన్స్ జీవితాన్ని పోల్చుకోవడం మానేయండి. సోషల్ మీడియాలో కనిపించేది జీవితంలోని ఒక్క ఫ్రేమ్ మాత్రమే, పూర్తి సినిమా కాదు.

ఇది పిసినారితనం కాదు, ఆర్థిక క్రమశిక్షణ. ఎంజాయ్‌మెంట్‌ను శాశ్వతంగా వదులుకోమని కాదు. ఈరోజు కొంచెం ఓపిక పడితే రేపు ఎలాంటి టెన్షన్ లేకుండా ఎంజాయ్ చేయవచ్చు. ఈరోజు మిమ్మల్ని చూసి నవ్వినవాళ్లే రేపు మీ దగ్గరికి సలహా కోసం వస్తారు. అప్పటివరకు నిశ్శబ్దంగా మీ పని మీరు చేసుకుంటూ వెళ్లండి. ఎందుకంటే గెలుపు ఎప్పుడూ ప్రకటనతో రాదు, ఫలితంతోనే మాట్లాడుతుంది!!

# ప్రజాస్వామ్యానికి అగ్ని పరీక్ష!?



దేశ రాజధాని దిల్లీ ముట్టడిలో ఉన్న నగరాన్ని తలపిస్తోంది. సరిహద్దుల్లో మేకుల పట్టీలు పరిచారు. గగనతలంలో డ్రోన్ల నిఘా సాగించారు. 30 వేలకు పైగా పోలీసు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. రెండు వందల యాభై రైళ్లను రద్దుచేశారు. నలభై ఐదు మెట్రో స్టేషన్లు మూసేశారు. కోర్టులు వర్చువల్‌గా నడుస్తున్నాయి. ఇంత భారీ బందోబస్తు ఏ ఉగ్రవాద ముప్పు కోసమో, విదేశీ దాడి కోసమో కాదు. కేవలం జంతర్ మంతర్ వద్ద జరగాల్సిన ఒక యువజన నిరసనను ఆపడం కోసం. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను నిలిపివేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనకు పిలుపునిచ్చింది. నిరసన మొదలవకముందే ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను విమానాశ్రయంలోనే నిర్బంధించారు. యూట్యూబర్ ధ్రువ్ రాఠీ సహా వందలాది మందిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉద్యమం పుట్టుకే ఒక వ్యంగ్యం. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ ఈ ఏడాది మేలో వచ్చిన ఒక న్యాయస్థాన వ్యాఖ్య దీనికి నాంది. దానికి నిరసనగా సోషల్ మీడియాలో సరదాగా మొదలైన ఈ వేదిక చూస్తుండగానే కోట్లాది యువతను ఆకర్షించింది. జులైలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వివాదంపై ఈ ఉద్యమం సాగించిన పోరాటం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసింది. ఆ విజయంతో ఉత్సాహం పొందిన సీజేపీ ఇప్పుడు ఏకంగా రాజ్యాంగ సంస్థ అధిపతినే లక్ష్యంగా చేసుకుంది. సెప్టెంబర్ చివరి వారంలో ఒక జాతీయ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఓటరు జాబితా సవరణ విషయంలో మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పది నెలల్లో కనీసం పధ్నాలుగు సార్లు సీఈసీ వద్ద అభ్యంతరాలు లేవనెత్తారని ఆ కథనం పేర్కొంది. ఆ కథనమే ఈ ఆగ్రహానికి ఆజ్యం పోసింది. 48 గంటల అల్టిమేటం ముగిశాక గాంధీ జయంతి రోజున ముంబయి శివాజీ పార్కులో సీజేపీ నిరసన మొదలైంది. తర్వాత దిల్లీలో వందలమందిని నిర్బంధించారు. ఈనెల 8న బెంగళూరు ఫ్రీడమ్ పార్కులో నటుడు ప్రకాశ్ రాజ్ నేతృత్వంలో భారీ సభ జరిగింది. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో వేలాది కార్యకర్తలను దిల్లీకి రాకుండానే అడ్డుకున్నారని సీజేపీ ఆరోపిస్తోంది. "ఇక ఎమర్జెన్సీ ప్రకటిస్తే సరిపోతుంది కదా" అంటూ దీప్కే చేసిన వ్యాఖ్య ఉద్యమకారుల ఆవేదనకు అద్దం పడుతోంది.

ఈ పరిణామాలు ఇప్పుడు ఒక యువజన ఉద్యమ పరిధిని దాటిపోయాయి. జాతీయ రాజకీయాలను కుదిపేస్తున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈనెల 6 నుంచి వరుసగా మూడు రోజులు దిల్లీ వీధుల్లో ఆందోళనలు చేసింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రెండు రోజుల్లో రెండుసార్లు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్ ప్రక్రియలో కోట్లాది ఓట్లను తొలగించారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. 'ఓట్ చోరీ' జరిగిందని, జ్ఞానేశ్ కుమార్ చట్టబద్ధమైన సీఈసీయే కాదని రాహుల్ గట్టిగా చెబుతున్నారు. రాష్ట్రపతిని కలిసి విపక్షాలు తమ వాదనను వినిపించాయి. పార్లమెంటులో సీఈసీ తొలగింపు తీర్మానానికి సన్నాహాలు చేస్తున్నాయి. సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. మరోవైపు కేరళ మాజీ ప్రధాన కార్యదర్శి జిజి థామ్సన్ చేసిన ఆరోపణ సీఈసీని మరింత ఇరుకున పెట్టింది. తాను ప్రభుత్వ సర్వీసులో ఉండగానే బీజేపీ టికెట్‌పై పోటీ చేయాలని జ్ఞానేశ్ కుమార్ సూచించారన్నది ఆ ఆరోపణ. అయితే ఈ వివాదంలో అసలైన ఆసక్తికర కోణం ఎన్డీయే శిబిరం నుంచే వస్తోంది. కేంద్ర మంత్రి, ఎల్జేపీ (రాంవిలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ స్పందించారు. ప్రజల సందేహాలను తీర్చి వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత సీఈసీదేనని స్పష్టం చేశారు. టీడీపీ లోక్‌సభాపక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు సైతం మాట్లాడారు. ఏపీలో సర్ పారదర్శకంగానే జరిగిందంటూనే, ఎన్నికల సంఘం వివరణ ఇస్తే ప్రజల విశ్వాసం బలపడుతుందని సూచించారు. రాష్ట్రీయ లోక్ మోర్చా కూడా ఇదే తరహా ఆందోళన వ్యక్తం చేసింది. అధికార కూటమి భాగస్వాములే వివరణ కోరడం చిన్న విషయం కాదు. బీజేపీ మాత్రం ఎన్నికల సంఘానికి గట్టిగా అండగా నిలుస్తోంది. వరుస ఓటముల నిస్పృహతోనే విపక్షాలు ఈ దుష్ప్రచారానికి దిగాయని ఆరోపిస్తోంది. ఎన్నికల సంఘం సైతం తన వైఖరిని వెల్లడించింది. ఏ సంస్థలోనైనా అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు సహజమని, తమ చర్యలన్నీ చట్టబద్ధమేనని వాదిస్తోంది. సామాజికవేత్తలు మాత్రం మరో ప్రశ్న సంధిస్తున్నారు. నిరసనలకు కేటాయించిన జంతర్ మంతర్‌లోనే శాంతియుత అసమ్మతికి చోటు లేకపోతే ప్రజాస్వామ్యంలో నిరసనకు ఇంకెక్కడ స్థానం ఉంటుందని యోగేంద్ర యాదవ్ వంటివారు నిలదీస్తున్నారు.

ఈ పరిణామాలు ఏ దిశగా సాగుతున్నాయో అంచనా వేయాలంటే రెండు వైపులా లోపాలను నిష్పాక్షికంగా చూడాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత వ్యూహం స్వల్పకాలంలో నిరసనను అడ్డుకోగలదేమో. కానీ దీర్ఘకాలంలో అది ఉద్యమానికే కొత్త ఊపిరి పోస్తుంది. రైళ్లు రద్దు చేసి, మెట్రోలు మూసి, విద్యార్థులను రైళ్లలోనుంచే దించి నిర్బంధించడం వంటి చర్యలు మరో ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. ఒక సాధారణ నిరసనకు ప్రభుత్వం ఇంతగా ఎందుకు భయపడుతోందన్నదే ఆ ప్రశ్న. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌వంటి పొరుగు దేశాల్లో యువత ఆగ్రహం ప్రభుత్వాలనే కుదిపేసిన ఉదంతాలు కళ్ల ముందే ఉన్నాయి. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలు వాటికంటే ఎంతో బలమైనవి. అయినా యువత గొంతును లాఠీలతో నొక్కిపెట్టాలనుకోవడం వివేకం అనిపించుకోదు. అదే సమయంలో సీజేపీ నేతలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక రాజ్యాంగ సంస్థ అధిపతిని 'అతిపెద్ద దేశద్రోహి' అంటూ దూషించడం ఉద్యమ నైతికతను దెబ్బతీస్తుంది. ఆరోపణలు ఎంత తీవ్రమైనవైనా వాటిని నిరూపించాల్సిన వేదికలు న్యాయస్థానాలు, పార్లమెంటే. సీఈసీని తొలగించాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించినంత కఠినమైన ప్రక్రియ ఉంటుంది. దానికి పార్లమెంటు ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. విపక్షాల బలాన్ని చూస్తే తొలగింపు తీర్మానం నెగ్గడం దాదాపు అసాధ్యం. కాబట్టి ఈ పోరాటం చివరకు నైతిక ఒత్తిడి స్థాయిలోనే తేలే అవకాశం ఎక్కువ. ఆ ఒత్తిడికి ఎన్డీయే మిత్రపక్షాల గొంతు తోడైతే పరిస్థితి మారవచ్చు. బిహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఓటర్ల సెంటిమెంట్‌ను పట్టించుకోవాల్సిన భాగస్వాముల ఒత్తిడి పెరిగితే కేంద్రం దిగిరాక తప్పదు.

ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు ఉన్న మార్గం ఒక్కటే. ఎన్నికల సంఘం మౌనం వీడాలి. సర్ ప్రక్రియలో తొలగించిన, చేర్చిన ఓట్ల వివరాలను పారదర్శకంగా బయటపెట్టాలి. కమిషనర్ల మధ్య తలెత్తిన విభేదాలపై స్వతంత్ర సమీక్షకు అంగీకరించాలి. జులైలో విద్యార్థి ఉద్యమంతో చర్చలు జరిపినట్టే.. ఇప్పుడూ ప్రభుత్వం సంప్రదింపుల మార్గం తెరవాలి. ఎన్నికల సంఘం విశ్వసనీయతే భారత ప్రజాస్వామ్యానికి పునాది. ఆ పునాదిపై అనుమానపు నీడలు పడితే ఎవరు గెలిచినా ఓడేది ప్రజాస్వామ్యమే! బొద్దింకలని ఈసడించుకున్న యువతే ఇప్పుడు వ్యవస్థల జవాబుదారీతనాన్ని ప్రశ్నిస్తోంది. ఆ ప్రశ్నకు బలప్రయోగం సమాధానం కాదు, పారదర్శకతే సరైన జవాబు! ■



చిన్న పిల్లలకు పెద్దగా ఎంపికలుండవు. ఎక్కడ ఉండాలి? ఏం తినాలి? ఎక్కడికి వెళ్లాలి? మాట వినకపోతే ఏం చేయాలి? అనేవన్నీ తల్లిదండ్రులుగా మీరే నిర్ణయిస్తారు. అయితే పిల్లలపై పూర్తి నియంత్రణ సాధించడమే పెంపకం కాదు. వారు పెద్దయి, స్వతంత్రంగా ఎదిగిన తర్వాత కూడా మిమ్మల్ని గౌరవిస్తూ, మీ సలహాలను వినేలా తీర్చిదిద్దడమే తల్లిదండ్రులు సాధించే అసలైన విజయం. పిల్లల చేయి పట్టుకుని నడిపించే రోజులు కొన్నే, మనసు పట్టుకుని నిలిచే బంధం జీవితాంతం. భయంతో పొందిన విధేయత వయసుతో పాటు కరిగిపోతుంది, ప్రేమతో పొందిన గౌరవం కాలంతో పాటు బలపడుతుంది. అదుపు చేసినవారిని పిల్లలు దాటి వెళ్తారు, నమ్మకం నేర్పినవారిని పిల్లలు ఎప్పటికీ వెతుక్కుంటూ వస్తారు.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## బర్గర్ కింగ్.. బంపర్ ఆఫర్!




"తిన్నంత తిను!" అంటూ జపాన్‌లోని బర్గర్ కింగ్ ఓ బంపర్ ఆఫర్ ప్రకటించింది. అయితే ఇక్కడే ఓ చిన్న మెలిక ఉంది. ముందుగా 'బ్లాక్ బర్గర్ మీల్' ఆర్డర్ చేసి, దాన్ని పూర్తిగా లాగించేయాలి. తర్వాత రసీదు, ర్యాపర్ కౌంటర్‌లో చూపిస్తేనే అన్‌లిమిటెడ్ బర్గర్లు, ఫ్రైస్ వడ్డిస్తారు. అదీ కేవలం 30 నిమిషాల్లోనే. అంటే తినడం కూడా టైమ్ లిమిట్‌తో కూడిన పరీక్షే. 2001లో మూతపడి, 2007లో తిరిగి తెరిచిన బర్గర్ కింగ్ ఐదో వార్షికోత్సవ సంబరమిది. ఆఫర్ మంచిదే, కానీ కడుపుకు కూడా కొంచెం ఖాళీ ఉండాలి సుమీ!



# గురి అదిరింది..
## చోళ చీఫ్స్ బోణీ కొట్టింది!

### కాకతీయ నైట్స్‌పై 6-2 తేడాతో ఘన విజయం

### ఎనిమిది బాణాలతో పది పాయింట్ల గురి కొట్టిన అలెజాండ్రా

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ జట్టు విజయంతో శుభారంభం చేసింది. పీపుల్స్ ప్లాజా వేదికగా శుక్రవారం జరిగిన పోరులో కాకతీయ నైట్స్‌ను 6-2 తేడాతో ఓడించింది. చోళ చీఫ్స్ విజయంలో కొలంబియా ఆర్చర్ అలెజాండ్రా ఉస్కియానో కీలక పాత్ర పోషించింది. లీగ్‌లో అరంగేట్రం చేసిన ఆమె ఎనిమిది బాణాలను పర్ఫెక్ట్ పది పాయింట్ల లక్ష్యానికి గురిపెట్టి అద్భుత ప్రదర్శన చేసింది. చివరి సెట్‌లో చోళ చీఫ్స్ 80 పాయింట్లు సాధించగా, కాకతీయ నైట్స్ 79 పాయింట్లతో సరిపెట్టుకుంది. మరో మ్యాచ్‌లో చీరో ఆర్చర్స్ 6-2 తేడాతో రాజ్‌పుతానా రాయల్స్‌ను ఓడించింది. పృథ్వీరాజ్ యోధాస్ కూడా 6-2 తేడాతో మైటీ మరాఠాస్‌పై విజయం సాధించింది. శనివారం జరిగే పోటీల్లో మైటీ మరాఠాస్‌తో చోళ చీఫ్స్, పృథ్వీరాజ్ యోధాస్‌తో చీరో ఆర్చర్స్, రాజ్‌పుతానా రాయల్స్‌తో కాకతీయ నైట్స్ తలపడనున్నాయి.

# ఒక్క ఓవరే కొంపముంచిందా?

## రెండో టీ20లో భారత్ ఓటమిపై
## గవాస్కర్ విశ్లేషణ

- కుల్దీప్ బదులు మయాంక్, అర్ష్‌దీప్‌లలో ఒకరికి బంతి ఇవ్వాల్సిందని వ్యాఖ్య
- 249 పరుగులు చేసినా దక్కని విజయం
- షాయ్ హోప్ శతకంతో వెస్టిండీస్ సంచలనం
- బౌలింగ్ నిర్ణయమే మ్యాచ్‌ను మలుపు తిప్పిందన్న సన్నీ



భారీ స్కోరు సాధించినా విజయం ఎందుకు దక్కలేదు..? 249 పరుగులు చేసిన భారత జట్టు ప్రత్యర్థిని ఎందుకు నిలువరించలేకపోయింది..? రెండో టీ20లో వెస్టిండీస్ చేతిలో టీమిండియా ఓటమికి కారణమైన కీలక నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్‌లో ఒక ఓవర్ ఫలితాన్ని మార్చేసిందని అభిప్రాయపడ్డాడు. ఆ సమయంలో కుల్దీప్ యాదవ్‌కు బదులుగా మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్‌లలో ఒకరికి బంతి ఇచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పేర్కొన్నాడు. రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగడంతో జట్టు 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో టీమిండియా సునాయాసంగా గెలుస్తుందని భావించినప్పటికీ వెస్టిండీస్ బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. ఆరంభంలో మయాంక్ యాదవ్ మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. 36 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టిన అతడు భారత్‌కు ఆశలు కల్పించాడు. అయితే వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అజేయ శతకంతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. హోప్‌కు తోడుగా షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 84 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యంతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. రూథర్‌ఫోర్డ్‌ను కుల్దీప్ యాదవ్ అవుట్ చేసినప్పటికీ ఆ తర్వాత అతడికి మరో ఓవర్ ఇవ్వడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారిందని గవాస్కర్ విశ్లేషించాడు. ఆ సమయంలో వేగంగా బౌలింగ్ చేస్తున్న మయాంక్ లేదా అర్ష్‌దీప్‌ను ఉపయోగించి ఉంటే వెస్టిండీస్‌పై ఒత్తిడి కొనసాగించే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో భారత బౌలర్లు విఫలమవడం, కీలక సమయంలో బౌలింగ్ మార్పులు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం ఓటమికి కారణాలుగా చర్చకు వచ్చాయి. అయితే కుల్దీప్ వేసిన ఒక్క ఓవరే ఓటమికి కారణమని కాకుండా, ఆ సమయంలో తీసుకున్న బౌలింగ్ నిర్ణయాన్ని గవాస్కర్ ప్రధానంగా ప్రశ్నించాడు. భారీ లక్ష్యాన్ని సైతం వెస్టిండీస్ ఛేదించడంతో భారత జట్టు బౌలింగ్ వ్యూహాలపై చర్చ మొదలైంది. 'భారీ స్కోర్ల మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ చేసిన పెద్ద పొరపాటు కుల్దీప్‌తో 17వ ఓవర్ వేయించడం. ఆ ఓవర్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 రన్స్ రావడంతో విండీస్ విజయం తేలికైంది. ఆ ఓవర్ గనుక మయాంక్ యాదవ్ లేదా అర్ష్‌దీప్ సింగ్‌లతో వేయించి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎందుకంటే.. అప్పటివరకూ మయాంక్ ఎకానమీ ఓవర్‌కు 12 ఉంది. అప్పటికీ విండీస్ విజయానికి మరిన్ని రన్స్ కావాలి.17వ ఓవర్లో మరో వికెట్ లభించి ఉంటే.. మ్యాచ్ టీమిండియా వైపు తిరిగేది. అంతేకాదు 19వ ఓవర్లో శివం దూబేతో బౌలింగ్ చేయించడం సరైన నిర్ణయం కాదు. విండీస్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడుతున్నందున అతడి బదులు ఆ ఓవర్ కుల్దీప్ వేయాల్సింది' అని గవాస్కర్ పేర్కొన్నాడు. రాంచీలో థ్రిల్లింగ్ విక్టరీతో సిరీస్‌ను 1-1తో సమం చేసింది పర్యాటక జట్టు. ఐదు టీ20ల సిరీస్‌లో కీలకమైన మూడో మ్యాచ్ అక్టోబర్ 11 ఆదివారం జరుగనుంది.

# వారణాసి.. ఎంత చెప్పాలో అంతే..

కలలు కనే డీప్-రెడ్ వెల్వెట్ లుక్‌లో యుక్తి తరేజా స్టన్స్







హెబ్బా పటేల్ యొక్క రొమాంటిక్ రెడ్ గౌన్ లుక్ స్వచ్ఛమైన సొగసుగా ఉంది

రాజమౌళి సినిమా అంటే షూటింగ్ మొదలైనప్పటి నుంచి రిలీజ్ వరకు ఒక ఐరన్ కాంపౌండ్ లాంటి సెక్యూరిటీ ఉంటుంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ టైమ్ లో ఎవరెంత మాట్లాడాలో ఆయన కంట్రోల్ లోనే ఉండేది. కానీ మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' ప్రాజెక్ట్ విషయంలో మాత్రం సీన్ పూర్తిగా రివర్స్ అయింది. సినిమా గురించి టీమ్ నుంచి చిన్న చిన్న అప్డేట్స్ రెగ్యులర్ గా బయటకు రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.

ఈ సినిమా బ్యాక్ డ్రాప్ పై అసలు హింట్ మొదట రైటర్ విజయేంద్ర ప్రసాద్ నుంచే వచ్చింది.

ఇది ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే అడ్వెంచర్ అని ఆయన చెప్పగా.. ఆ తర్వాత స్వయంగా రాజమౌళే గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ అంటూ ఒక క్లారిటీ ఇచ్చేశాడు. దీనికి తోడు మహేష్ బాబు కూడా ఆఫ్రికా షెడ్యూల్స్, అడవుల్లో షూటింగ్ ఎక్స్ పీరియన్స్ గురించి ఓపెన్ గా మాట్లాడటంతో సినిమా థీమ్ ఏంటనేది జనాలకు ఈజీగా అర్థమైపోయింది.

మరోవైపు ఎప్పుడూ తన పనేదో తాను సైలెంట్ గా చేసుకుపోయే సంగీత దర్శకుడు కీరవాణి కూడా ఈసారి తన పంథా మార్చారు. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉంటాయని, మ్యూజిక్ వర్క్ ఎంతవరకు వచ్చిందో కచ్చితమైన వివరాలు బయటపెట్టారు. గతంలో జక్కన్న సినిమాల్లో సాంగ్స్ కౌంట్ రిలీజ్ టైమ్ వరకు సస్పెన్స్ గానే ఉండేది. కానీ ఏకంగా 2027 సమ్మర్ రిలీజ్ టార్గెట్ అంటూ కీరవాణి ముందే ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక యాక్షన్ ఎపిసోడ్స్ మీద రీసెంట్ గా ఎస్ఎస్ కార్తికేయ ఇచ్చిన హైప్ అంతా ఇంతా కాదు. ఆర్ఆర్ఆర్, బాహుబలిని మించేలా సీట్ ఎడ్జ్ యాక్షన్ ఉంటుందని ఆయన చెప్పగా.. తన క్యారెక్టర్ లో కూడా హెవీ స్టంట్స్ ఉంటాయని హీరోయిన్ ప్రియాంక చోప్రా ముందే ఒక క్లూ ఇచ్చింది. ఇలా టీమ్ లోని ఒక్కొక్కరు ఒక్కో పాయింట్ ను రివీల్ చేస్తుండటంతో, ప్రేక్షకుడి మైండ్ లో 'వారణాసి' కాన్వాస్ పై ఒక స్ట్రాంగ్ ఇమేజ్ క్రియేట్ అయిపోయింది.అయితే బయటపడుతున్న ఈ విషయాలన్నీ కథను డ్యామేజ్ చేసే లీకులు ఏమాత్రం కాదు. ఎవరెన్ని చెప్పినా మహేష్ మెయిన్ క్యారెక్టరైజేషన్, అసలు కాన్ఫ్లిక్ట్, స్టోరీలో వచ్చే మేజర్ ట్విస్టులు మాత్రం ఇంకా రాజమౌళి లాకర్ లోనే సేఫ్ గా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే జక్కన్న ఈసారి కండిషన్స్ కు కాస్త బ్రేక్ ఇచ్చి, సినిమా బజ్ ను ఎప్పుడూ పీక్స్ లో ఉంచేలా పక్కా క్యాలిక్యులేటెడ్ గానే ఈ ఇన్ఫర్మేషన్ ను వదులుతున్నట్లు అనిపిస్తోంది.గతంలో రాజమౌళి సినిమాల చిన్న అప్డేట్ కోసం ఫ్యాన్స్ నెలల తరబడి వెయిట్ చేసేవాళ్లు. కానీ ఇప్పుడు గ్లోబల్ మార్కెట్ ను టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో, సినిమా గురించి కంటిన్యూస్ గా బజ్ ఉండడం అవసరం. అందుకే రాజమౌళి లిమిట్స్ సడలించి, ప్రమోషన్ కు ఉపయోగపడే కంటెంట్ ను టీమ్ ద్వారానే బయటకు రప్పిస్తున్నారు. దీంతో వారణాసి పేరు ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉండేలా మాస్టర్ ప్లాన్ వేశారని అర్థమవుతోంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com